

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV
STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 06 | సంచిక 96 | ఎడిటర్ : బరిగెల శివ | గురువారం 27, ఫిబ్రవరి 2025 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పజాజ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్




# అధునాతన పద్ధతిలో.. తెలంగాణ అభివృద్ధి

**హైదరాబాద్(జై భీమ్ డెస్క్)**

నిధులు కొరతగా ఉన్న తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి వేగం పెరగడాన్ని తెలంగాణ రాష్ట్రంపై సీఎం రేవంత్ రెడ్డికి ఉన్నటువంటి ప్రత్యేక శ్రద్ధేనని డాక్టర్ బరిగెల శివ అభివర్ణించారు.రాష్ట్రానికి రావలసిన నిధుల కోసం క్రమం తప్పకుండా కేంద్ర ప్రభుత్వం పెద్దలను కలుస్తూ తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి నిధులు కేటాయించాలని పలుమార్లు స్వయంగా వినతి పత్రాలతో విన్నవించినప్పటికీ రాష్ట్ర అభివృద్ధికి కావలసినన్ని నిధులు సకాలంలో చేరకపోవడంతో ఆర్థిక వనరుల సమకూర్పు పట్ల తెలంగాణ ప్రభుత్వం అనేక ఇబ్బందులను ఎదుర్కొం టుందన్నారు.ప్రతి నెల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి వస్తున్న రాబడి 18 వేలకోట్ల రూపాయలు మాత్రమేనని కానీ ఖర్చులు 22 వేల కోట్ల రూపాయలు అవుతుండగా అదనపు భారంగా ఖర్చులు పెరుగుతుండడంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జాగ్రత్తగా ప్రధాన అంశాలపై దృష్టి సారించి పరిపాలన కొనసాగిస్తుందన్నారు. అసలే అప్పుల రాష్ట్రం ఆపై నిధుల కొరత రెండు తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని చావు దెబ్బ కొట్టే విధంగా కఠినాతి కఠినమైన ఇబ్బందులకు గురి చేస్తున్నప్పటికీ పెట్టుబడుల రూపంలో కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చుకున్న నిధులను జాగ్రత్తగా ఖర్చులు చేస్తూ తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోనికి నడిపిస్తుందన్నారు. గతంలో ఉన్న ప్రభుత్వం కేంద్రాన్ని నిధులు కోరగానే రాష్ట్ర బిజెపి నేతలు దగ్గరుండి నిధులు ఇప్పించేవారని తెలిపారు.నేడు రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో తెలంగాణ అభివృద్ధి పట్ల పనిచేస్తున్నప్పటికిని సకాలంలో రావలసిన కేంద్ర నిధులకు ప్రస్తుత తెలంగాణ బిజెపి నేతల్లో స్వయాన ఇద్దరు కేంద్ర మంత్రులు రాష్ట్రం తరఫున కేంద్ర క్యాబినెట్లో పనిచేస్తున్నప్పటిని తెలంగాణ ప్రజల ఆత్మగౌరానికి అనుగుణంగా నిధులు

- మిగతా 3లో..



### రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ సేవలు

- గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉంది
- అత్యల్ప నిధులతో రాష్ట్రంలో అభివృద్ధి ఏంటో చూపిస్తున్నాము
- నిధులు ఇచ్చి సహకరించండని ప్రధానినీ కోరిన సీఎం రేవంత్ రెడ్డి
- రాష్ట్రానికి రావాల్సిన నిధులను కేంద్రం కేటాయించాల్సిందే
- డాక్టర్ బరిగెల శివ



# సిద్ధమైన సనాతన రాజ్యాంగం..

**ఊరూరా చేర్చేందుకు ఉద్యమం**
**డాక్టర్, బరిగెల శివ**
**జై భీమ్ సంస్థల ఫౌండర్,చైర్మన్**

**హైదరాబాద్(జై భీమ్ డెస్క్)**




ప్రపంచ వ్యాప్తంగా కుంభమేళా గొప్పతనం, సాంస్కృతిక, చారిత్రక ఔన్నత్యం గురించి చర్చలు జరుగుతూ ఉంటే మరోవైపు కుంభమేళా హిందూత్వ శక్తుల పునరేకీకరణ, సంఘటితంగావటం, కొత్త కొత్త ఎజెండాలు రూపొందించటానికి సంబంధించిన కసరత్తులకు కూడా వేదికగా మారింది. దీనికి సంబంధించిన వార్తలు పెద్దగా ప్రచారంలో లేవు. వసంతపంచమి రోజున హిందూరాష్ట్ర నిర్మాణం దిశగా కొత్త రాజ్యాంగాన్ని కుంభమేళాలో ఆవిష్కరించారు. దీనికి సంబంధించిన వార్తను ది తెలుగు వైర్ పాఠకులకు అందించింది. దీనికి కొనసాగింపుగా ప్రముఖ న్యాయనిపుణులు నందితా హక్సర్ భారత రాజ్యాంగానికి హిందూ రాజ్యాంగానికి ఉన్న తేడాల గురించిన వ్యాఖ్యానాన్ని కూడా అందించాము. తాజా కథనంలో హిందూత్వ రాజ్యాంగాన్ని ప్రజల దగ్గరకు తీసుకెళ్లేందుకు ఏర్పడిన ప్రత్యేక వేదిక, దాని కార్యాచరణ ప్రణాళికల గురించి తెలుసుకుందాం. వసంత పంచమి రోజున జరిగిన సనాతన రాజ్యాంగ ఆవిష్కరణ సందర్భంగా మాట్లాడిన వక్తలు ఋషి రాజ్యాంగం రూపకల్పన తొలి సమావేశం 2001 ప్రయాగ్‌రాజ్ కుంభమేళాలో జరిగిందనీ, రెండోసారి 2007 అర్ధకుంభమేళాలో, మూడవసారి 2013 కుంభమేళాలో, నాలుగవసారి 2019 కుంభమేళాలో సమావేశాలను ఏర్పాటు చేశారనీ తెలిపారు. నాలుగు సమావేశాలలో తీసుకున్న



డాక్టర్ బరిగెల శివ
జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్

- మిగతా 6లో..

# సైబర్ ఇంటిలిజెన్స్.. నివేదికలో షాకింగ్ నిజాలు

**హైదరాబాద్(జై భీమ్ న్యూస్)**

జేబులో చెయ్యి పెట్టనక్కరలేదు.. గోడలు దూకాల్సిన పని అంతకన్నా లేదు.. తలుపులు బద్దలు కొట్టాల్సిన అవసరమే లేదు.. ఒక్క క్లిక్ తో లక్షలు హాంఫట్. ప్రస్తుత కాలంలో పెరిగిపోయిన సైబర్ నేరాల తీరిది. గుట్టుచప్పుడు కాకుండా, మనకే తెలియకుండా మన బ్యాంకు ఖాతా ఖాళీ అవుతుంది. దేశంలో సైబర్ నేరాలు అతి పెద్ద సమస్యగా మారాయి. సాధారణ నేరాల కంటే అత్యధికంగా నమోదవడమే కాకుండా కోట్ల రూపాయలు సొత్తు నేరగాళ్లు కాజేస్తున్నారు. మరి మన బ్యాంకు ఖాతాలో ఎంత డబ్బు ఉందో నేరగాళ్లకు ఎలా తెలుస్తోంది? అనే ప్రశ్న తలెత్తవచ్చు. దీనికి సంబంధించిన మినిస్ట్రీ ఆఫ్ హోం ఎఫైర్స్ కు సైబర్ క్రైం ఇంటిలిజెన్స్ అధికారులు ఇచ్చిన నివేదిక విస్తుపోయే విషయాలను వెల్లడించింది. బ్యాంకులలో పనిచేసే వారి నుంచే నేరగాళ్లకు ఖాతాదారుల ఖాతా వివరాలు అందుతున్నాయని, సైబర్ నేరగాళ్లు నకిలీ బ్యాంక్ ఖాతాలు తెరవడానికీ కొందరు బ్యాంకు అధికారులు కూడా సహకరిస్తున్నారని నివేదికలో సైబర్ ఇంటిలిజెన్స్



- మిగతా 5లో..

# న్యాయవాదుల నియంత్రణకే ఈ బిల్లు

**డాక్టర్, బరిగెల శివ**
**జై భీమ్ సంస్థల ఎడిటర్**

**హైదరాబాద్ (భీమ్ న్యూస్)**

కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన 'అడ్వకేట్ ఎమెండ్‌మెంట్ బిల్లు 2025' బిల్లు పూర్తిగా అడ్వకేట్ల హక్కులను హరించే విధంగా ఉండడమే గాక న్యాయ వ్యవస్థ స్వతంత్ర ప్రతిపత్తిని తీసివేసే విధంగా ఉంది. కేంద్ర ప్రభుత్వం అడ్వకేట్లను తమ చెప్పుచేతల్లో ఉంచుకుంటూ, న్యాయ వ్యవస్థను నియంత్రించే ప్రయత్నంగా దీనిని చూడవచ్చు. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మెంబర్లుగా ముగ్గురు కేంద్ర ప్రభుత్వం నియమించేవారు ఉండాలనే సవరణ బార్ కౌన్సిల్ పైన కేంద్ర ప్రభుత్వ అజమాయిషీ కిందకే వస్తుంది. కేంద్ర ప్రభుత్వం బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు సదరు చట్టంలోని నిబంధనలకు సంబంధించిన నియమాలను అమలు చేయాలని ఉత్తర్వులు ఇవ్వవచ్చును అనే సవరణ కూడా బార్ కౌన్సిల్ మీద కేంద్ర ప్రభుత్వ పెత్తనం కిందకే వస్తుంది. ఇవి అభ్యంతరకరం. ఎవరైనా అడ్వకేట్‌కి మూడేళ్ళ శిక్ష పడి, హైకోర్టు గానీ సుప్రీంకోర్టు గానీ శిక్షను ఖరారు చేసినట్లయితే అతని బార్ కౌన్సిల్ సభ్యత్వం రద్దు అవుతుంది అనే సవరణ చాలా కఠినంగా ఉంది. ఇంతటి కఠిన నిబంధన ఇతర వృత్తులలో ఉన్నవారికి గానీ, రాజకీయ



డాక్టర్ బరిగెల శివ
జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్

- మిగతా 5లో..

# సంపాదకీయం

## భూతాపం.. మానవాళికి పెనుశాపం

ప్రజలు ఎదుర్కొంటున్న పర్యావరణ సమస్యలకు, వాతావరణ మార్పులకు శిలాజ ఇంధనాల వినియోగమే చాలా వరకు కారణం. సాంప్రదాయ ఇంధన వనరుల స్థానంలో క్లీన్ ఎనర్జీని ఉపయోగించడమే పర్యావరణ సంబంధిత సమస్యలకు విరుగుడు. వాతావరణ మార్పులపై ప్రపంచ దేశాలు బాధ్యతా రహితంగా ప్రవర్తిస్తున్నాయని చెప్పడానికి శిలాజ ఇంధనాల వాడకాన్ని కనీస స్థాయికి తగ్గించకపోవడమే ఒక ఉదాహరణ. అడవులను నరికివేయడం, పచ్చదనం పెంచడానికి సరైన ప్రణాళికలు రూపొందించి ఆచరించకపోవడం, పట్టణీకరణపై మక్కువ, చూపడం, వాయు కాలుష్యం పెరగడం వంటి ఎన్నో కారణాలు భవిష్యత్‌లో సంభవించబోయే విపత్కర పరిణామాలను సూచిస్తున్నాయి. ప్రపంచం ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు మూలం శిలాజ ఇంధనాల వాడకం. సౌరశక్తి వాడకంపై దృష్టి సారించకుండా శిలాజ ఇంధనాల వినియోగం అధికం చేయాలనే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వితండవాదం పర్యావరణానికి పెద్దదెబ్బ. ఇప్పుడిప్పుడే 'క్లీన్ ఎనర్జీ'పై దృష్టి సారిస్తున్న ప్రపంచానికి ట్రంప్ నిర్ణయం ఆందోళన కలిగిస్తున్నది. ట్రంప్ బాధ్యతారాహిత్యానికి ప్రపంచం మూల్యం చెల్లించుకోకతప్పదు. పెరుగుతున్న భూ ఉష్ణోగ్రతలను 2 డిగ్రీల సెల్సియస్ దిగువ స్థాయికి తగ్గించడం, సగటు ఉష్ణోగ్రతల్లో పెరుగుదలను 1.5 డిగ్రీల సెల్సియస్‌కి పరిమితి చేయాలన్న ఆలోచనతో పారిస్ ఒప్పందం కుదిరింది. ఐక్యరాజ్య సమితిలోని మెజారిటీ సభ్యదేశాలు వాతావరణ మార్పులపై ఆందోళన చెంది, గ్రీన్ హౌస్ వాయువులను తగ్గించి, ఉష్ణోగ్రతలను నియంత్రించడానికి ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లో ఆమోదించిన ఒప్పందాన్ని అంగీకరించడం జరిగింది. పారిస్ ఒప్పందం 2016 వ సంవత్సరం నుండి అమల్లోకి వచ్చింది. గతంలో డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా అధికారంలో ఉన్నప్పుడు పారిస్ ఒప్పందం నుండి వైదొలగడం జరిగింది. జో బైడెన్ అమెరికా అధ్యక్షుడిగా ఉన్న కాలంలో అమెరికా తిరిగి పారిస్ ఒప్పందంలో చేరింది. ట్రంప్ ఈ సంవత్సరం అధికారంలోకి వచ్చాక తిరిగి పాత పాటే పాడుతూ పారిస్ ఒప్పందం నుండి తప్పుకున్నారు. తమ దేశ అవసరాలకు ఖనిజ ఇంధనాన్ని వాడుకోవాలని నిర్ణయించుకున్నారు. ప్రపంచానికి దశాదిశా నిర్దేశం చేయవలసిన అమెరికా తన తొందరపాటు నిర్ణయాలతో ప్రపంచాన్ని సాంప్రదాయేతర ఇంధనాల వనరుల వాడకం నుంచి శిలాజ ఇంధనాల వాడకంపై తిరిగి దృష్టి సారించేలా నిర్ణయాలు తీసుకోవడంలో ఎలాంటి ఔచిత్యం లేదు. ఇప్పటికే మన చుట్టూ ఉన్న వాతావరణం పరిమితికి మించిన హానికరమైన వాయువులతో నిండిపోయింది. ప్రజలు వాయు కాలుష్యంతో, శ్వాసకోశ సంబంధమైన వ్యాధులతో బాధపడుతున్నారు. శిలాజ ఇంధనాల వాడకం అతి ప్రమాదకరమైన పరిస్థితులకు దారితీస్తున్నది. బొగ్గు, పెట్రోలియం, సహజవాయువు మొదలైనవి శిలాజ ఇంధనాలు. భారత దేశంలో బొగ్గు తర్వాత ప్రధాన ఇంధన వనరు పెట్రోలియం. పెట్రోలియం అనే పదం పెట్రా, ఓలియం అనే లాటిన్ పదాల నుండి ఏర్పడింది. పెట్రోలియం అనగా రాతి నూనె అని అర్థం. శిలాజ ఇంధనాలు చెట్లు, జంతువుల అవశేషాల నుండి ఏర్పడతాయి. బొగ్గు, పెట్రోలియం, సహజవాయువు వంటి శిలాజ ఇంధనాలను వినియోగించిన తర్వాత తిరిగి భర్తీ కావడానికి లక్షల సంవత్సరాల కాలం పట్టవచ్చు. ఇవి తరిగేపోయే శక్తి వనరులు. చైనా శిలాజ ఇంధనాల వినియోగంలో ప్రపంచంలోనే అత్యధిక శాతం వాటా కలిగి ఉంది.అమెరికా కూడా చైనాతో సమానంగా ఫోసిల్ ఫ్యూయల్ వినియోగిస్తున్నది. ఈ విషయంలో భారతదేశం ప్రపంచంలో మూడవ స్థానం లో ఉంది. కాలుష్యకారకంగా భావిస్తున్న చమురు వినియోగంలో భారత్ చైనా స్థానాన్ని అధిగమించబోతుందనే అంచనాలున్నాయి. బొగ్గు వినియోగంలో భారత్ ఇప్పటికే యూరప్, ఉత్తర అమెరికా దేశాలను అధిగమించింది. భారత దేశం గ్రీన్ ఎనర్జీపై దృష్టి సారించాలని నిర్ణయించినా దీనికి తగ్గ కార్యాచరణ పూర్తి స్థాయిలో ఆచరణకు నోచుకోలేదు. ప్రపంచ ఇంధన వినియోగంలో 80 % పైగా చమురు, బొగ్గు ప్రధాన పాత్ర వహిస్తున్నాయి. చైనా, అమెరికా, భారత్‌ల తర్వాత శిలాజ ఇంధనాల వినియోగంలో రష్యా, జపాన్, ఇరాన్, సౌదీ అరేబియా, దక్షిణ కొరియా, ఇండోనేషియా, కెనడా, యుకెలు పోటాపోటీగా ముందుకు సాగుతున్నాయి. పెరుగుతున్న పారిశ్రామీకరణ, అర్బనైజేషన్, వ్యవసాయ రంగంలో విస్తరిస్తున్న రసాయనిక మందుల వాడకం, వ్యవసాయ వ్యర్థాల దహనం వలన వాయు కాలుష్యం విపరీతంగా పెరిగి పోతున్నది.కార్బన్ డయాక్సైడ్,మిథేన్,నైట్రస్ ఆక్సైడ్ వంటి వాయువులను గ్రీన్ హౌస్ వాయువులంటారు. ఈ వాయువుల వలన భూవాతావరణం వేడెక్కి అనేక సమస్యలకు కారణమవుతున్న మాట సత్యదూరం కాదు. అధిక ఉష్ణోగ్రతలకు కారణమవుతూ, వాతావరణం ఆకస్మిక మార్పులకు లోనుకావడం వంటి పరిణామాలను గుర్తించాలి. పెరిగిపోతున్న గ్రీన్ హౌస్ వాయువుల శాతాన్ని తగ్గించి, గ్లోబల్ వార్మింగ్ విషయంలో ప్రపంచ దేశాలు దృష్టి సారించాలి.సహజ ఇంధన వనరుల స్థానంలో చౌకగా లభించే ప్రత్యామ్నాయ ఇంధనాలను వినియోగించాలి. శిలాజ ఇంధన వనరుల లభ్యత ఆందోళన కరమైన స్థితికి చేరుకుంటున్న నేపథ్యంలో భవిష్య పరిణామాలను ఆకళింపు చేసుకుని సాంప్రదాయేతర ఇంధన వనరుల వాడకాన్ని పెంచాలి. పైగా ప్రస్తుతం మనం వినియోగిస్తున్న ఇంధనాల వలన ప్రపంచంలో కాలుష్యం విపరీతంగా పెరిగిపోతున్నది. బొగ్గు వలన అధికంగా కాలుష్యం వెలువడుతున్నది. అమెరికా విద్యుత్ ఉత్పత్తిలో 44 శాతం బొగ్గును వినియోగిస్తున్నారు. బొగ్గు వలన కర్బన ఉద్గారాలు అధికం మొత్తంలో విడుదల కాబడి, గ్లోబర్ వార్మింగ్ పెరుగుదలకు కారణం కావడం ఆందోళనకరం. విచ్చలవిడిగా ఇంధన వనరులను ఉపయోగిస్తూ ప్రపంచాన్ని ముందుకు తీసుకుపోతున్నామని భ్రమించినవారికి తరిగిపోతున్న ఇంధన వనరులను చూసి, భవిష్యత్ అవసరాలపై ఆందోళన అవసరం లేదా? ప్రపంచ వ్యాప్తంగా ఇప్పుడిప్పుడే సాంప్రదాయేతర ఇంధన వనరుల వాడకంపై అవగాహన పెరుగుతున్నది. దశాబ్దకాలం ముందు ప్రపంచం మేల్కొన్ని ఉంటే ప్రస్తుతం నెలకొంటున్న అవాంఛనీయ పరిణామాలకు ఆస్కారం ఉండేది కాదు. పర్యావరణ సంబంధిత సమస్యలే కాకుండా తరిగిపోతున్న సాంప్రదాయ ఇంధన నిక్షేపాలను కాపాడుకుని ఉండేవారం.

# ఊబకాయంపై అవగాహన ఆవశ్యకత

దేశంలో ఊబకాయం తీవ్ర సమస్యగా మారుతోందని, దీన్ని అధిగమించడానికి చర్యలు చేపట్టాలని ఆదివారం జరిగిన మన్‌కీ బాత్ వేదికగా ప్రధాని నరేంద్ర మోడీ పిలుపు ఇవ్వడం శు భపరిణామం. ఈ మేరకు ఊబకాయంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు 10 మంది ప్రముఖులను కూడా నామినేట్ చేశారు. వీరిలో ప్రముఖ పారిశ్రామిక వేత్త ఆనంద్ మహీంద్రా, జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా తదితరులు ఉన్నారు. ఈ ఉద్యమం మరింత విస్తరించేలా వీరంతా ఒక్కొక్కరు 10 మంది చొప్పున వ్యక్తులను నామినేట్ చేయవలసి ఉంటుంది. 2022లో ప్రపంచ ఆరోగ్యసంస్థ గణాంకాల ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా 250 కోట్ల మంది అధిక బరువుతో బాధపడుతున్నారు. ప్రతి ఎనిమిది మందిలో ఒకరు ఊబకాయం సమస్యను ఎదుర్కొంటున్నారు. అనేక సమస్యలకు దారి తీసే ఊబకాయాన్ని అధిగమించడం మనందరి బాధ్యతగా ప్రధాని మోడీ గుర్తు చేశారు. తినే ఆహారంలో వంటనూనె వాడకాన్ని కనీసం పది శాతం మేరకు తగ్గించుకోవాలని ప్రధాని పిలుపునిచ్చారు. ఫిబ్రవరి ప్రారంభంలో ఉత్తరాఖండ్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో కూడా ప్రధాని నరేంద్ర మోడీ ఊబకాయం గురించి ప్రముఖంగా ప్రస్తావించారు. ఫిజికల్ యాక్టివిటీని ప్రోత్సహించే విధంగా ఫిట్ ఇండియా ఉద్యమంలో అందరూ భాగస్వాములు కావాలని సూచించారు. పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకుంటూ అందుకు తగ్గట్టు వ్యాయామం చేయాలని సూచించారు. అన్నింటికన్నా ముఖ్యం నూనెల వినియోగాన్ని 10% వరకు తగ్గించుకోవాలని ప్రత్యేకంగా సూచించడం గమనార్హం. లాన్సెట్ నివేదిక ప్రకారం దేశంలోని పట్టణాల జనాభాలో దాదాపు 70% మంది అత్యధిక శరీర బరువుతో బాధపడుతున్నారు. ఊబకాయం బాధితులు ఎక్కువగా ఉన్న దేశాల్లో అమెరికా, చైనా తరువాత స్థానం భారత్‌దే. దాదాపు 8 కోట్ల మంది అధిక బరువుతో బాధపడుతున్నారు. వీరిలో మహిళలు 4.4 కోట్ల మంది ఉండగా, పురుషులు 2.6 కోట్ల మంది ఉన్నారు. చాలా మంది మహిళలు ఇంటిపనుల కారణంగా తమ ఆహారం గురించి, ఆరోగ్యం గురించి పట్టించుకోవడం లేదు. దీంతో వాళ్లు ఊబకాయం బారినపడుతున్నారు. ఇది క్రమంగా మధుమేహం, రక్తపోటు తదితర దీర్ఘకాలిక రోగాలకు దారి తీస్తోంది. లాన్సెట్ నివేదిక ప్రకారం 1990లో 0.4 మిలియన్లతో పోలిస్తే 2022లో భారత దేశంలో 5 నుంచి 19 సంవత్సరాల మధ్య వయసు పిల్లల్లో ఊబకాయం దాదాపు 12.5 మిలియన్ల వరకు పెరిగిందని వెల్లడైంది. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (ఎన్‌ఎఫ్‌హెచ్‌ఎస్)లో దేశం లోని 33 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఐదేళ్ల లోపు పిల్లల్లో ఊబకాయం సమస్య తీవ్రంగా ఉందని తేలింది. మహారాష్ట్ర, గుజరాత్, త్రిపుర, లక్షద్వీప్, జమ్మూకశ్మీర్, ఉత్తరప్రదేశ్, ఢిల్లీ, బెంగాల్, ఆంధ్రప్రదేశ్, లద్దాఖ్‌లో ఐదేళ్ల లోపు పిల్లల్లో అధిక బరువు ఉన్నవారి సంఖ్య పెరిగింది. 201516లో చేపట్టిన కుటుంబ సర్వే ప్రకారం అధిక బరువు ఉన్న చిన్నారులు 2.1% నుంచి 3.4 శాతానికి చేరుకున్నారు. 2016లో 519 సంవత్సరాల వయసు గల 340 మిలియన్ల మంది పిల్లలు, యుక్తవయసులో ఉన్నవారు ఊబకాయంతో ఉండగా, 2020లో 5 సంవత్సరాల కంటే తక్కువ వయసున్న 39 మిలియన్ల మంది పిల్లలు ఉన్నారు. దేశవ్యాప్తంగా కేవలం చిన్నారుల్లోనే కాదు, మహిళలు, పురుషుల్లోనూ ఊబకాయం పెరిగిపోతోంది. మహిళల్లో 20.6% నుంచి 24 శాతానికి, పురుషుల్లో 18.9 శాతం నుంచి 22.9 శాతానికి చేరింది. చిన్నారులు సహా పెద్దవారి లోనూ ఊబకాయం పెరిగిపోవడానికి శారీరక శ్రమ తగ్గిపోవడం, ఆహార పద్ధతులే కారణంగా ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. గత 15 ఏళ్లుగా స్థిరమైన ఆర్థిక వృద్ధి కారణంగా ప్రజల ఆదాయాలు పెరిగాయి. ఆర్థికంగా ఎదగడమే భారతీయుల్లో ఊబకాయం పెరగడానికి కారణమని అభిప్రాయపడుతున్నా, ఆహార అలవాట్లు సరిగ్గాలేకపోవడం, జింక్ ఫుడ్స్ వంటివి ఎక్కువగా తీసుకోవడం మరో ప్రధాన సమస్యగా వైద్యులు పేర్కొంటున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచనల ప్రకారం బాడీ మాస్ ఇండెక్స్ (బిఎంఐ) 25 దాటితే అధిక బరువుతో ఉన్నట్టే. బిఎంఐ 30 దాటితే అత్యంత అధిక బరువు. అదే ఊబకాయంగా పరిగణిస్తారు. శరీరంలో కొవ్వు ఎంత పెరిగితే, ఇన్సులిన్ చర్యకు అంత అడ్డంకి ఏర్పడుతుంది. ముఖ్యంగా పొత్తికడుపు, కాలేయం, పాంక్రియాస్‌లో కొవ్వు పేరుకుపోయినప్పుడు ఇన్సులిన్ ఉత్పత్తికి ఆటంకం కలుగుతుంది. భారతీయుల్లో కాలేయం, ప్యాంక్రియాస్‌లో కొవ్వు నిల్వలు ఎక్కువగా కనిపిస్తుంటాయి. ఊబకాయం వల్లనే భారతదేశంలో కార్డియో వాస్కులర్ డిసీజ్, టైప్2 దయాబెటిస్, కీళ్ల సమస్యలు, స్లీప్ అప్నియా, కొన్ని క్యాన్సర్లు, శ్వాసకోశ సమస్యలు వస్తున్నాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. మానసిక ఆరోగ్య సమస్యలు కూడా ఎదురవుతున్నాయి. దేశ జనాభా ప్రయోజనాలను పొందాలంటే, ఆరోగ్య పారామితులను మెరుగుపర్చడానికి అనారోగ్యకరమైన ఆహార విధానాలను, పెరుగుతున్న ఊబకాయ రేట్లను తక్షణమే పరిష్కరించాల్సిన అవసరం ఉందని 202324 ఆర్థిక సర్వే పేర్కొంది.గత సంవత్సరం ఏప్రిల్‌లో ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసిఎంఆర్) తాజా ఆహార మార్గదర్శకాలను జారీ చేసింది. దేశంలో మొత్తం వ్యాధుల భారంలో 56.4% అనారోగ్యకరమైన ఆహారాల వల్లనే దాపురిస్తోందని పేర్కొంది. చక్కెరలు, కొవ్వుతో నిండిన, అధికంగా ప్రాసెస్ చేసిన ఆహార పదార్థాల వినియోగం అమాంతంగా పెరిగిపోతోందని ఆవేదన వ్యక్తం చేసింది. క్రమం తప్పకుండా వ్యాయామాలు చేయడం, ఆహార విధానాలను మార్చుకోవడం ద్వారా ఊబకాయం సమస్య నుంచి బయటపడవచ్చని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

# బిసిల చాంపియన్ శివశంకర్

తామే వెనకబడిన తరగతుల వారికి నాయకులమని, తోటి వారి అభ్యున్నతే తమ ఏకైక లక్ష్యమని చాలా మంది వకాలతా పుచ్చుకుని, ఎన్నికల్లో, లేదా పదవులు పొందడంలో బిసి కార్డులను ఉపయోగించుకుని, తీరా పదవులు పొందాక, లక్ష్యాన్ని నిర్లక్ష్యం చేయడం సర్వసాధారణం. కానీ అలాకాక తాము పొందిన పదవుల ద్వారా బిసిల అభివృద్ధికి పాటుపడిన వారు బహు అరుదుగా కనిపిస్తారు. అలా బీసీల అభివృద్ధికి తోడ్పడిన వాళ్లలో పుంజాల శివ శంకర్ గారు మొదటి వరుసలో ఉంటారు.కింది స్థాయి నుంచి ఎదిగి నాయకులూ అయ్యే వారు చాల మంది ఉంటారు, కాని ఒక బలహీన వర్గాల కుటుంబంలో అది కూడా ఒక పేద కుటుంబంలో పుట్టి దేశ రాజకీయలను ఒక దశాబ్దం పాటు శాసించే స్థాయికి ఎదగటం, అది కూడా ఇందిరా గాంధీ లాంటి శక్తిశాలికి కుడి భుజంలాగా ఉండటం, ఇందిర, రాజీవ్ అధికార నివాసాలకు పక్కనే ఎప్పటికీ ఇల్లు ఉండటం ఒక్క శివశంకర్ కే సాధ్యమైంది. బలహీన వర్గాల నాయకుడిగా పేరున్న శివశంకర్ తెలంగాణ మూన్నూరు కాపు కులానికి చెందిన నాయకుడు. 1929, ఆగస్టు 10న హైదరాబాద్ సమీపంలో ని మామిడి పల్లిలో ఆయన జన్మించారు. శివశంకర్ మెట్రిక్యులేషన్ వరకు హైదరాబాద్ లో చదివి ఆ తర్వాత చదువుకు ఇంట్లో ఇబ్బందులు ఏర్పడడముతో తన అన్నతో కలిసి పంజాబ్ కు వెళ్లి, కూలి పనులు చేస్తూ కొన్ని సందర్భాలలో తిండిలేక మజ్జిగ తాగుతూ, పల్లీలు తింటూ చదువుకుంటూ అమృత్ సర్ హిందూ కాలేజీ నుండి బీ.ఏ.పూర్తి చేశారు. తర్వాత ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఎల్ ఎల్ బి పూర్తి చేశారు. న్యాయ శాస్త్రాల్లో, ఇంగ్లీష్ భాషలో మంచి పట్టుగల శివశంకర్ హైదరాబాద్ లో న్యాయవాదిగా ప్రాక్టీసును ప్రారంభించి పేదల బడుగు బలహీన వర్గాల కేసులను ఉచితంగా కోర్టులలో వాదించేవారు. మంచి సమర్థుడైన న్యాయవాదిగా పేరు తెచ్చుకొని సిటీ సివిల్ కోర్ట్ బార్ అసోసియేషన్ కార్యదర్శిగా, 1956లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడిగా పని చేశారు. 1972లో ఆంధ్రప్రదేశ్ లో వెనుకబడిన తరగతులకు 25 శాతం రిజర్వేషన్లు కల్పించారు. ఆ తర్వాత అనంతరామన్ కమిషన్ ప్రభుత్వానికి సూచనలు చేస్తూ బీసీ కులాలకు 30% రిజర్వేషన్లు ప్రతిపాదించింది. దీనిపై ఏపీ హైకోర్టులో 110 రిట్ పిటిషన్లు దాఖలయ్యాయి, అప్పుడు బీసీలకు 30% రిజర్వేషన్లు చెల్లవని హైకోర్టు తీర్పునివ్వగా... నాటి జేఏసి తరపున శివశంకర్ సొంత ఖర్చుతో 18 నెలలు ఢిల్లీలో ఉండి సుప్రీం కోర్టులో బీసీ రిజర్వేషన్లను గెలిపించుకొని తిరిగి వచ్చారు. 1974 నాటికి చిన్న వయసులోనే ఆంధ్రప్రదేశ్ హై కోర్ట్ జడ్జిస్థాయికి ఎదిగారు. ఆంధ్రప్రదేశ్ లోని న్యాయ వ్యవస్థలో ఒకే కులానికి చెందినవారు ఆధిపత్యం వహిస్తూ సీనియారిటి ప్యానల్ లో మిగతా వారిని పరిగణన లోకి తీసుకోక పోవడం గమనించి తను ప్రభుత్వ న్యాయమూర్తి పరిధిలో పేదల బడుగు బలహీన వర్గాల తరపున పోరాటం చేయలేక పోతున్నానని ఏకంగా ఉద్యోగానికి రాజీనామా చేశారు. చదువు కోవడమంటే ప్రభుత్వ ఉద్యోగం సాధించడము సమాజాన్ని పట్టించు కోకుండా వ్యక్తిగత ఎదుగుదలే ముఖ్యంగా భావించే నేటి తరానికి సమాజం కోసం హై కోర్ట్ జడ్జి స్థాయి ఉద్యోగాన్ని వదులుకోవడము ఆయన చిత్తశుద్ధికి, త్యాగ నిరతికి నిదర్శనం. హై కోర్టు జడ్జిగా రాజీనామా చేసి హైకోర్టు, సుప్రీం కోర్టులల్లో న్యాయ వాదిగా ప్రాక్టీసు చేస్తూ అన్ని వర్గాలకి సామాజిక న్యాయం విషయములో అధ్యయనం చేస్తుండే వారు. ఆయన మొదటి సారి గా 1977 లో ఇందిరాగాంధీని కలుసుకున్నా తమ అపార న్యాయ విజ్ఞానంతో ఆమె మనసు చూరగొనడమే కాకుండా అతితక్కువ కాలంలో ఆమెకు అత్యంత సన్నిహితుడయ్యారు. 1974-75లో ఆంధ్రప్రదేశ్ హైకోర్ట్ న్యాయమూర్తిగా ఉన్నారు. 1977 లో ఎమర్జీన్సీ తర్వాత ఆయన ఇందిగా గాంధీకి న్యాయవాదిగా కూడా ఉన్నారు. 1979లో సికిందరాబాద్ నుంచి లోక్ సభకు ఎన్నికయ్యారు. ఆ నియోజకవర్గం నుంచి 1980 లో రెండో సారి ఎన్నికయ్యారు. 1981లో ఇందిరాగాంది మంత్రివర్గంలో చాలా కీలకమయిన నాయకుడిగా ఉన్నారు. 1985లో శివశంకర్ రాజ్యసభకు ఎన్నికయ్యారు. 1993 దాకా రాజ్యసభలోనే కొనసాగారు. ఈ మధ్యలో ఆయన విదేశీ వ్యవహారాల శాఖ, మానవ వనరుల శాఖ మంత్రిగా పనిచేశారు. కొద్ది రోజులు ప్లానింగ్ కమిషన్ డిప్యూటీ చైర్మన్ గా కూడా పనిచేశారు. 1988-89 లో రాజ్యసభ కాంగ్రెస్ పక్ష నాయకుడి గా ఉన్నారు. తర్వాత సిక్కిం, కేరళ వర్నర్ గా నియమితులయ్యారు. 1998లో తెనాలి నుంచి లోక్ సభ కు పోటీచేసి గెలుపొందారు. ప్రధాని నివాసానికి దగ్గరలో 5, సఫ్దర్ జంగ్ లేన్ బంగళాను ఆయన కేటాయించారు. ఇంధన శాఖను నిర్వహించిన సమయంలో, రాజకీయ జోక్యం లేకుండా, పెట్రోలు బంకులు, గ్యాస్ ఏజెన్సీల కేటాయింపులను క్రమబద్ధీ కరించారు. మానవ వనరుల శాఖ మంత్రిగా కేంద్రీయ విద్యాలయాల విస్తరణకు కృషి చేశారు. ఇందిరాగాంధి మరణానంతరం రాజీవ్ గాంధీ ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావడానికి ముఖ్య పాత్ర పోషించిన శివశంకర్ మెదక్ (గతములో ఇందిరాగాంధి గెలిచిన స్థానం) నుండి లోక్ సభకు పోటీ చేసి స్వల్ప తేడాతో ఓడిపోవడముతో 1985 నుండి 1993 వరకు గుజరాత్ నుండి రాజ్యసభకు ఎన్నికై కేంద్ర వాణిజ్య శాఖామంత్రిగా 1985 లో ,1986 లో విదేశాంగ వ్యవహారాల మంత్రిత్వ శాఖనూ నిర్వహించారు. ఏ సభలో సభ్యత్వం లేని రోజులలో కూడా ఆయనకు ప్రధాని నివాసంతో విడదీయని సంబంధాలు ఉండేవి. అందుకే సఫ్దర్ జంగ్ లేన్ నివాసం చాలాకాలం కొనసాగింది. ఇందిర, రాజీవ్ కాలంలో అన్ని కీలకమయిన పార్టీ, ప్రభుత్వ నిర్ణయాలలో ఆయన పాత్ర వుండేది. రాజీవ్ హాయంలో చాలా కీలకమయిన నిర్ణయాలెన్నో తీసుకున్నా సరే ఆయన పనితీరు ఎపుడూ వివాదాస్పదం కాలేదు. ఆయన కూడా ఎపుడూ వార్తలక్కే ప్రయత్నం చేయలేదు. రాజీవ్ దూతగా ఆయన నేపాల్, బంగ్లాదేశ్ లను సందర్శించి ఇరుగు పొరుగు దేశాలతో సత్సంబంధాలు నెలకొల్పడంలో ప్రధానికి బాగా సహకరించే వారని ఆయన మిత్రులు చెబుతారు. పంజాబ్ ఒప్పందంలో కూడా శివశంకర్ కీలక ప్రాత పోషించారని చెబుతారు. కాంగ్రెస్ లో సరైన గుర్తింపు లేక, స్వార్థ రాజకీయాలకు తట్టుకోలేక 2004 లో ఆయన కాంగ్రెస్ ను వదిలేశారు. 2017 ఫిబ్రవరి 27న ఆయన మరణించారు. శివశంకర్ జీవితాంతం అంబేద్కర్ , పూలే ఆదర్శంగా, ఆ మహా నాయకుల కాన్సెప్ట్ మీద పని చేశారు. జ్యుడీషియల్ తో సహ అన్నీ రంగాల్లో దళితులకు ప్రాతినిధ్యం ఉండాలని శివశంకర్ కోరుకునే వారు.ఇందిరా గాంధీ పక్షాన కేసులను వాదించి, ఆమెకు అత్యంత సన్నిహితులుగా ఉండేవారు. రాజీవ్ గాంధీ హాయంలో ప్రభుత్వంలో ప్రధాని తర్వాత చాలా పలుకుబడి ఉన్న వ్యక్తి శివశంకరే. నేడు, పి శివ శంకర్ ప్రధానమంత్రి తర్వాత దేశములో అత్యంత శక్తివంతమ్మైన వ్యక్తి" 1986 నాటికి ఇండియా టుడే పత్రిక రాసిన కథనాని బట్టి శివశంకర్ పలుకుబడి ఏ పాటిదో చెప్పకనే చెపుతుంది.

# దేశాభివృద్ధిలో ప్రభుత్వేతర సంస్థల భాగస్వామ్యం

సామాజిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న లాభాపేక్ష లేని నిస్వార్థ స్వచ్ఛంద పౌర సమూహాలను "ప్రభుత్వేతర సంస్థలు" లేదా "నాన్-గవర్నమెంటల్ ఆర్గనైజేషన్స్ (ఎన్జీవోస్)" అని పిలుస్తారు. సమాజాన్ని పట్టి పీడిస్తున్న పేదరికం, అసమానతలు, పరివారం కాలుష్యం, మానవీయ సమస్యలకు తగు పరిష్కారాలు చూపడానికి, సమాజాభివృద్ధి, సానుకూల మార్పులకు కృషి చేయడం, మానవ హక్కుల పరిరక్షణ, ఎన్జీవోలను సముచితంగా గౌరవించుకోవడం, ప్రభుత్వేతర సంస్థలు ప్రపంచవ్యాప్తంగా నిరంతరం కృషి చేస్తున్నాయి. మెరుగైన పౌరసమాజ నిర్మాణానికి ఎన్జీవోలు చేస్తున్న కృషిని ఏకరువు పెట్టడానికి, వాటి పట్ల ప్రజలకు అవగాహన కల్పించడానికి సామాజిక కార్యకర్త "మార్కస్ లియర్స్ స్కద్మనిస్" నేతృత్వంలో 2009 నుంచి ప్రతి ఏట 27 ఫిబ్రవరి రోజున "ప్రపంచ ప్రభుత్వేతర సంస్థల దినోత్సవం" వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ప్రతి వ్యక్తి తమకు తోచినట్లుగా విరాళాలు, శ్రమదానాలు, నిధులు సమకూర్చుకునే కార్యకలాపాలు, చేయడానికి స్వచ్ఛందంగా ముందుకు రావాలని ఈ వేదిక కోరుకుంటున్నది. ప్రపంచ ఎన్జీవోల దినోత్సవం-2025 ఇతివృత్తంగా "సుస్థిర భవితకు స్థానిక ఉద్యమాల సాధికారత" అనే అంశాన్ని తీసుకొని ప్రచారాలు నిర్వహించడం జరుగుతున్నది. ఈ రోజున ఎన్జీవోల ప్రాధాన్యాన్ని వివరించాడానికి, ప్రోత్సహించడానికి తగు సదస్సులు, వెబినార్స్, కార్యశాలలు, శిక్షణ కార్యక్రమాలు, అవార్డుల ప్రదానాలు, క్షేత్రస్థాయి కార్యక్రమాలు, సంఘటిత కార్యక్రమాలు, పాలసీ వివరణలు, నిధుల సేకరణలు, సామాజిక మాధ్యమాల్లో ప్రచారాలు లాంటివి నిర్వహించవచ్చు. నేటి ప్రజా సమస్యల సకారాత్మక పరిష్కారానికి ప్రభుత్వాలు చేస్తున్న కృషితో పాటు ప్రభుత్వేతర సంస్థల సహాయ సహకారాలు కూడా దోహదపడుతున్నాయి. ఆర్య సమాజ్, నేషనల్ కౌన్సిల్ ఫర్ వూమన్, సంకల్ప్ తరు ఫౌండేషన్ లాంటి స్వచ్ఛంద సంస్థల రాకతో భారత్‌లో ఎన్జీవోల ఉద్యమాలు ఊపందుకున్నాయి. గ్రామీణాభివృద్ధి, మహిళా సాధికారత, బాలల సంక్షేమం, ప్రజారోగ్యం, విపత్తుల నిర్వహణ, మానవ హక్కుల పరిరక్షణ, పర్యావరణ పరిరక్షణ లాంటి సమస్యలను ఎన్జీవోలు పరిష్కరించడానికి ప్రయత్నాలు చేయడం కొనసాగుతున్నది. నిధుల కొరత, సుస్థిరత, జవాబుదారీతనం, ప్రభుత్వ నిర్లక్ష్యం లాంటి సవాళ్లను ఎదుర్కొంటున్న ఎన్జీవోల ఉద్యమాలు కొనసాగుతున్నాయి. గివ్ ఇండియా, స్మైల్ ఫౌండేషన్, గూంజ్, హెల్పేజ్ ఇండియా, ఆక్షన్‌ఏయిడ్, చైల్డ్‌లైన్ ఇండియా ఫౌండేషన్ లాంటి ప్రముఖ ఎన్జీవోలు భారత దేశాభివృద్ధికి నిస్వార్థంగా సేవలు అందిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 10 మిలియన్ల ఎన్జీవోల ద్వారా 50 మిలియన్ల స్వచ్ఛంద కార్యకర్తలు సేవలు అందిస్తున్నారు. ఇలాంటి ఎన్జీవో సంస్థలతో మనం కూడా కలిసి నిర్భాగ్యుల ముఖాల్లో ఆనంద భాష్యాలను చూద్దాం, బాధలే లేని భారతిని నిర్మిద్దాం.

# అధునాతన పద్ధతిలో తెలంగాణ అభివృద్ధి





మొదటి పేజీ తరువాయి

తీసుకురావడంలో పూర్తిగా విఫలమవుతున్నారన్నారు. కనీసం ఇప్పటికైనా తగినన్ని నిధులను మంజూరు చేయించి తెలంగాణ ప్రజలచే,ప్రభుత్వంచే, గౌరవ మన్ననలను పొందుకోవాలన్నారు రాష్ట్ర ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఐటీ మంత్రి శ్రీధర్ బాబు దేశ ప్రధాని నరేంద్ర మోడీని కలిసి రాష్ట్రంలో తలపెడుతున్న ప్రధాన అంశాల అభివృద్ధికి నిధుల సహకారం తప్పనిసరిగా అవసరమని విన్నవించినట్లు తెలిపారు త్వరితగతిన నిధులు మంజూరు చేసినట్లయితే ప్రామాణికంగా తీసుకున్న అంశాలను అభివృద్ధి చేసి నిరూపిస్తామని ప్రధానమంత్రి కి హామీ ఇచ్చినట్లు తెలియజేశారు. ప్రధానమంత్రిని కలిసిన సందర్భంలో సీఎం రేవంత్ రెడ్డి తెలిపిన వివరాల ఆధారంగా క్రింది విధంగా పరిశీలించగలమన్నారు.

**హైదరాబాద్ మెట్రో ఫేజ్–IIకు అనుమతి ఇవ్వండి...**

ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగాన్ని మంజూరు చేయండి...

మూసీ పునరుజ్జీవన ప్రాజెక్ట్ కు నిధులు ఇవ్వండి...

రీజినల్ రింగ్ రైల్... డ్రైపోర్ట్‌లు మంజూరు చేయండి

సెమీ కండక్టర్ మిషన్‌కు అనుమతించండి...

ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వినతి

హైదరాబాద్ మహా నగరంలో మెట్రో రైలు సౌకర్యం అన్ని ప్రాంతాలకు అందుబాటులోకి ఉద్దేశించిన హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్–%××%కు అనుమతించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.గత ప్రభుత్వం పదేళ్లుగా హైదరాబాద్ నగరంలో మెట్రో విస్తరణపై దృష్టి సారించలేదని ప్రధానమంత్రి దృష్టికి సీఎం తీసుకెళ్లారు. హైదరాబాద్ నగరంలో ఫేజ్–%××% కింద రూ.24,269 కోట్ల అంచనా వ్యయంతో 76.4 కి.మీ పొడవైన అయిదు కారిడార్లను ప్రతిపాదించామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు. ఈ ప్రాజెక్టుకు వెంటనే అనుమతించాలని అభ్యర్థించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో ఆయన అధికారిక నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం ఉదయం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలను ముఖ్యమంత్రి ప్రధానమంత్రి దృష్టికి తీసుకెళ్లారు.రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) ఉత్తర భాగంలో ఇప్పటికే 90 శాతం భూ సేకరణ పూర్తయినందున ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగాన్ని వెంటనే మంజూరు చేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. ఉత్తర భాగంతో పాటే దక్షిణ భాగం పూర్తయితే ఆర్ఆర్ఆర్‌ను పూర్తిగా సద్వినియోగం చేసుకోగలమన్నారు. దక్షిణ భాగం భూ సేకరణకు అయ్యే వ్యయంలో 50 శాతం భరించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ముఖ్యమంత్రి ప్రధానమంత్రికి తెలియజేశారు. ఆర్ఆర్ఆర్‌కు సమాంతరంగా రీజినల్ రింగ్ రైలు ప్రాజెక్టు ప్రతిపాదన ఉందని పీఎం మోదీకి సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. ఈ రీజినల్ రింగ్ రైలు పూర్తయితే తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల్లోని రైలు మార్గాలతో అనుసంధానత (కనెక్టవిటీ) సులభమవుతుందని ప్రధానమంత్రి మోదీకి సీఎం రేవంత్ రెడ్డి తెలియజేశారు.. రీజినల్ రింగ్ రైలుకు అనుమతి ఇవ్వాలని పీఎంను సీఎం కోరారు. సముద్ర మార్గం లేని తెలంగాణకు వస్తువుల ఎగుమతులు, దిగుమతులు సులువుగా చేసేందుకు రీజినల్ రింగు రోడ్డు సమీపంలో డ్రైపోర్ట్ అవసరమని, ఆ డ్రైపోర్ట్ నుంచి ఏపీలోని సముద్ర పోర్ట్ లను కలిపేందుకు గ్రీన్ ఫీల్డ్ రోడ్డు తో పాటు రోడ్డును ఆనుకొని రైలు మార్గం మంజూరు చేయాలని ప్రధానమంత్రి మోదీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. తెలంగాణ సంస్కృతి, ఆధ్యాత్మికత మూసీ నదితో ముడిపడి ఉందని... రాజధాని హైదరాబాద్ నగరం మధ్యగా మూసీ ప్రవహిస్తోందని.. అంత ప్రాధాన్యం ఉన్న మూసీ పునరుజ్జీవనానికి సహకరించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈసా, మూసా నదుల సంగమంలో ఉన్న బాపూ ఘాట్ అభివృద్ధి, మూసీ ప్రక్షాళనకు 27 ఎస్టీపీల నిర్మాణం, మూసీ రిటైనింగ్ వాల్స్,కరకట్టల నిర్మాణం,మూసీ గోదావరి నదుల అనసంధానంతో కలిపి మొత్తంగా ప్రాజెక్టుకు రూ.20 వేల కోట్లు ఆర్థిక సహాయం అందజేయాలని ప్రధానమంత్రిని ముఖ్యమంత్రి కోరారు.గాంధీ సరోవర్ ప్రాజెక్ట్ కు 222.7 ఎకరాల రక్షణ భూముల బదిలీకి సహకరించాలని పీఎంకు ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు.రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణకు 61 ఐపీఎస్ కేడర్ పోస్టులు వచ్చాయని, 2015లో రివ్యూ తర్వాత మరో 15 పోస్టులు అదనంగా వచ్చాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. సైబర్ నేరాలు,డ్రగ్స్ కేసులు పెరగడం,రాష్ట్రంలో పెరిగిన పట్టణాలు, ఇతర అవసరాల దృష్ట్యా తెలంగాణకు అదనంగా 29 ఐపీఎస్ పోస్టులు మంజూరు చేయాలని పీఎం మోదీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు.సెమీ కండక్టర్ల పరిశ్రమ ఏర్పాటుకు అనువైన పరిస్థితులు తెలంగాణలో ఉన్నందున ఇండియా సెమీ కండక్టర్ మిషన్ ప్రాజెక్టును రాష్ట్రంలో ఏర్పాటు చేసేందుకు అనమతించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. ముఖ్యమంత్రి వెంట రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఉన్నారు.

# బ్రిటీష్ పాలకులకు సింహ స్వప్నం

భారత స్వాతంత్ర ఉద్యమంలో దేశమాత విముక్తి కోసం సాయుధ పోరాటం చేసి అమరుడైన వీరుడు చంద్రశేఖర్ ఆజాద్. భగత్ సింగ్, రాజగురు, సుఖదేవ్, పండిత్ రామ్ ప్రసాద్ బిస్మిల్, ఠాకూర్ రోషన్ సింగ్, ప్రేమ్ కిషన్ ఖన్నా, అష్ఫాకుల్లా ఖాన్‌ల సహచరుడిగా బ్రిటీషువారి గుండెల్లో రైళ్లు పరిగెత్తించిన ఆజాద్ గర్వించదగ్గ అసహాయ శూరుడు, అసమాన వీరుడు. భగత్ సింగ్ మార్గ నిర్దేశకుడిగా పేరుగాంచిన ఆజాద్ పూర్తిపేరు చంద్రశేఖర సీతారామ్ తివారి. ఆయన "పండిత్‌జీ"గా కూడా పిలువ బడ్డాడు. 1857 తరువాత సాయుధ పోరాటం చేసిన వీరుల్లో మొట్టమొదటి వాడు, దేశ ప్రజల రక్షణ కోసం ధర్మ యుద్ధమే సరైనది గట్టిగా నమ్మినవాడు ఆజాద్. మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఝాబువా జిల్లా, బాభ్రా గ్రామంలో పండిట్ సీతారామ్ తివారి, జగరానీ దేవీలకు 1906 జూలై 23వ తేదీన చంద్రశేఖర్ ఆజాద్ జన్మించాడు. ప్రాథమిక విద్యను సొంత గ్రామం లోనే పూర్తి చేసి, తర్వాత వారణాసిలో సంస్కృత పాఠశాలలో హయ్యర్ సెకండరీ విద్యను అభ్యసించాడు. ఆయన చిన్నప్పటి నుంచి హనుమాన్ భక్తుడిగా ఉండేవాడు. 1919 లో అమృత్‌సర్‌లో జరిగిన జలియన్ వాలాబాగ్ దుర్ఘటనతో తీవ్రంగా కలత చెందిన ఆజాద్.. ఆ తరువాత 1921లో మహాత్మా గాంధీ నడిపిన సహాయ నిరాకరణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నాడు. ఈ ఉద్యమంలో పాల్గొన్న నేరానికి తన పదిహేనేళ్ల ప్రాయంలోనే అరెస్టయ్యాడు. విచారణ సందర్భంగా కోర్టులో ఆయనను విచారిస్తున్న బ్రిటిష్ న్యాయాధికారి ఖరేఘాట్‌కు ఆ బాలుడిచ్చిన సమాధానంతో మతి పోయింది. వాస్తవానికి తన పేరు 'ఆజాద్' అని, తన తండ్రి పేరును 'స్వతంత్రం', తన నివాసం 'జైలు' అని చెప్పాడు. "మతిపోయిన ఆ న్యాయాధికారి చిదిమితే పాలుగారే ముఖారవిందు డైన ఆ బాలుడిని చూస్తూ కూడా అధికార దర్పంతో '15 కొరడాల దెబ్బల' శిక్ష ప్రకటించాడు. నరరూప రాక్షసులు కొరడా ఝుళిపిస్తూ ఒక్కొక్క దెబ్బ కొడుతుంటే.. ఆ బాలుని శరీరమంతా రక్తసిక్తమై పోయింది. అయినా ఆ బాలుడు దెబ్బ పడినపుడు వందేమాతరం, భారత్‌మాతాకీ జై అంటున్నాడు. ఈ ధైర్యం చాలా గుర్తింపు తెచ్చిపెట్టింది. ఆ రోజు నుండి ఆయన పేరు 'చంద్ర శేఖర్ ఆజాద్' గా మారింది. "సహాయ నిరాకరణోద్యమం ఆజాద్‌లో దాగి ఉన్న విప్లవ వాదిని మేల్కొలిపింది. ఎలాగైనా సరే భారత దేశాన్ని బ్రిటీష్‌వారి కబంధ హస్తాల నుంచి విడిపించాల్సిందే నని ఆయన బలంగా నిశ్చయించు కున్నాడు. అనుకున్నదే తడవుగా ఆయన హిందూస్థాన్ సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసియేషన్‌ను స్థాపించాడు. భగత్ సింగ్, సుఖదేవ్, తదితరులకు మార్గ నిర్దేశకుడిగా మారి పోయాడు. ఆజాద్... 1926లో కకోరీ ట్రైన్ దోపిడీ, అదే సంవత్సరంలో వైశ్రాయి రైలును కాల్చి వేయడం, లాలా లజపతి రాయ్ మరణానికి కారణమైన బ్రిటిష్ వారిపై పగతీర్చు కోవడానికి 1928వ సంవత్సరంలో లాహోర్‌లో జె.పి. సాండర్స్‌ను కాల్చి వేయడం తదితర హింసాత్మక కార్యక్రమాల్లో పాలు పంచు కున్నాడు. ఒకానొక దశలో ఆజాద్ బ్రిటీష్ పోలీసులకు సింహస్వప్నంలా నిలిచారు. పోలీసుల హిట్‌లిస్ట్‌ను తయారు చేసుకున్న ఆయన వారిని చంపేదాకా వదిలి పెట్టలేదు. పదిహేనేళ్ల ప్రాయంలో అరెస్టయిన తరువాత బయటికి వచ్చి పోరాటంలో పాలు పంచుకున్న ఆజాద్... ఆ తరువాత తన మరణం దాకా కూడా ఒక్కసారి కూడా పోలీసులకు చిక్కలేదు. 1931, ఫిబ్రవరి 27వ తేదీన తన ఇద్దరు సహచరులను కలిసేందుకు అలహాబాదు లోని ఆల్ఫ్రెడ్ పార్క్‌కు చేరుకోగా, ఇన్ఫార్మర్లు ఇచ్చిన సమాచారం మేరకు బ్రిటీష్ పోలీసులు చుట్టు ముట్టారు. ఆజాద్‌ను లొంగి పోవాలంటూ హెచ్చరికలు చేశారు. అయినా కూడా మొక్కవోని ధైర్యంతో పోలీసులకు ఎదురు తిరిగాడు. వెంబడిస్తున్న పోలీసుల్లో ముగ్గురిని కాల్చి చంపాడు. ఐనా తరుముతూ వస్తున్న పోలీసులకు చిక్కే పరిస్థితి వచ్చింది. ఇక తుపాకీలో ఒకే ఒక్క బుల్లెట్ వుంది. దానితో వాళ్లను మట్టుబెట్ట లేనని తెలుసుకుని, బ్రిటిష్ వారి చేతిలో చనిపోవడం కంటే తనకు తానే ఆత్మత్యాగం చేసుకోవాలను కున్నాడు. వెంటనే తుపాకీని తన తలకు గురిపెట్టి కాల్చుకుని అమరడయ్యాడు. "నీలో ఉన్నది ఉప్పునీరా? అయితే నీకోసమే బతుకు. కాదూ ఉడుకు రక్తమంటావా? అయితే దేశం కోసం మరణించు. నీ దేహం నిప్పుకణాల కొలిమి అయితే అనుక్షణం నీ ప్రాణాన్ని సంఘానికి సమర్పించు. నీ గుండెకాయ పత్తికాయ అయితే భరత మాతను మరిచిపోయి నీ సుఖమే చూసుకో" – ఇలా రోమాలు నిక్కబొడుచు కునేలా పలికిన వీరుడు చంద్రశేఖర్ ఆజాద్. బతికుండగా బ్రిటీష్ వారు నన్ను పట్టుకోలేరు. వాళ్ళకు అంత దమ్ము లేదు. అని పదే పదే ఆజాద్ అంటుండే వాడు. "నా చావు నా చేతుల్లోనే ఉంది, శత్రువుల చేతుల్లో చావను" అంటూ చిన్ననాడు చేసిన శపథం నిజంచేస్తూ, పోలీసులకు చిక్కక, పిస్తోలుతో పేల్చుకుని స్వతంత్ర జీవిగా అస్తమించాడు. అజాద్ పోరాడిన తీరు భారతదేశ స్వాతంత్ర చరిత్రకే వన్నె తెచ్చిన ఘటన. భారతీయ యువతకు ఒక మహోజ్వల ప్రేరణ, అసమాన ఉదాహరణ. చివరిదాకా ఆజాద్‌ను ప్రాణాలతో పట్టుకోవాలని భావించిన బ్రిటీష్ పోలీసులు సాధ్యంకాక... ఆయన మృత దేహాన్ని స్వాధీనం చేసుకోవాల్సి వచ్చింది. ఆజాద్ ఆత్మత్యాగం ప్రజల్లో మరింత పట్టుదలను పెంచి, దేశభక్తిని రగిల్చింది. పోరాట పథం పట్టేలా ప్రోత్సహించింది. ఆజాద్ మరణించిన అలహాబాదు లోని ప్రయాగ్‌రాజ్ పార్కుకు చంద్రశేఖర్ ఆజాద్ పార్కుగా నామకరణం చేయ బడింది. మరణించే సమయంలో 'ఆజాద్' వద్ద ఉన్న పిస్టల్ అలహాబాద్ మ్యూజియంలో ప్రదర్శించ బడింది. 1988లో భారత ప్రభుత్వం చంద్రశేఖర్ ఆజాద్ ముఖచిత్రంతో తపాలా బిళ్ళను విడుదల చేసింది. 1965లో షహీద్ సినిమాతో ప్రారంభించి పలు భాషలలో ఎన్నో సినిమాలు నిర్మించ బడ్డాయి. 2018లో టెలివిజన్ సీరీస్ తీయబడింది. చంద్రశేఖర్ ఆజాద్ జన్మించిన మధ్య ప్రదేశ్‌లోని భభ్రా (భవ్రా) గ్రామం చంద్రశేఖర్ ఆజాద్ నగర్‌గా పిలవడం జరుగుతోంది.

## గుర్తు తెలియని శవం లభ్యం



**రాజన్న సిరిసిల్ల జిల్లా జై భీమ్ న్యూస్**

సిరిసిల్లని చంద్రంపేట శివారులోగల విజయ లక్ష్మి రైస్ మిల్ వెనుకాల గల సర్కారు తుమ్మ చెట్ల కింద నేలపై గుర్తు తెలియని మగ మనిషి శవం లభ్యం. శవం ఉబ్బి దుర్వాసన వస్తున్నది. మృతుని మొఖం మీద నలుపు రంగులో కమిలిన గాయమై ఉంది. శవం పక్కన ఎండిన రక్తం మరకలు గల ఒక బండ రాయి, కలదు, మృతుని వయస్సు అందాదా 35–40 సంవసరాలు ఉంటుంది. అట్టి గుర్తు తెలియని మృతుడిని ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు అక్కడ గల బండ రాయితో మొఖం మీద కొట్టగా గాయమై చనిపోయినట్లుగా ఉన్నది. మృతుడు ఎరుపు, తెలుపు, బూడిద రంగు గల టీ- షర్ట్, బ్లూ రంగు జీన్స్ పాంట్ దరించి ఉన్నాడు. మృతుని ఎత్తు అందాదా 5.7 ఫీట్స్ కలదు, మృతుని శవము సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీ గది నందు కలదు. మృతున్ని ఎవరైనా గుర్తించిన అతడి వివరాలు తెలిసిన సిరిసిల్ల పోలీస్ స్టేషన్ ఈ ఫోన్ నంబర్స్ కి 8712656366, 8712656367 సమాచారం తెలుపగలరు.

## యువ నేతాజీ ఫౌండేషన్ వరంగల్ వారిచే పండ్ల పంపిణీ





**వరంగల్ జిల్లా జై భీమ్ న్యూస్**

యువ నేతాజీ ఫౌండేషన్ వరంగల్ వారి ఆధ్వర్యంలో మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా వరంగల్ స్టేషన్ రోడ్డులో ఉన్న ఆకారపు గుడిలో 1000 మంది శివ భక్తులకు అరటి పండ్లు, అంగూర, ఖర్జూర, చెర్రీస్, సంత్రాలు ఈ 5 రకాల పండ్లును పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గంట రవికుమార్, ఎర్రబెల్లి ప్రదీప్ రావు, కుసుమ సతీష్, ఇంతేజర్గంజ్ సీ.ఐ యం.ఏ షుకూర్, వరంగల్ ట్రాఫిక్ సీ.ఐ రామకృష్ణ, ఆకారపు గుడి అయ్యగారు లంక శివ, యువ నేతాజీ ఫౌండేషన్ వరంగల్ అధ్యక్షులు కొత్తకొండ అరుణ్ కుమార్, వరంగల్ పోలీస్ కానిస్టేబుల్ కన్నె రాజు (స్విమ్మర్ రాజు), కానిస్టేబుల్ బొట్టు కమలాకర్, కోలా రాజేష్, ప్రభుత్వ ఉపాధ్యాయుడు గజ్జెల సుమన్, అలువల పృథ్వి, ఉప్పరపల్లి రాజ్ కుమార్, మునిగాల రాంప్రసాద్, ఊరటి రవికుమార్, సిరిపోతుల రవికుమార్, కన్నె జశ్వంత్, కనుకుంట్ల రంజిత్, చెన్నూరు వంశీ, సృజన, జ్యోతి, భావన, బిటుకూరి యాకయ్య, పాలకుర్తి విష్ణు, ఎస్.కె ముస్తఫా, లీగల్ అడ్వైజర్ రాచకట్ల కృష్ణ (హైకోర్ట్ అడ్వకేట్), చెలిమల్ల అశోక్ కుమార్, తూనం రాము, సి.ఐ.ఎస్.ఎఫ్ కానిస్టేబుల్ వైనాల రమేష్, మండల భూపాల్, మోడెం రాజశేఖర్ గౌడ్, నాగవెల్లి కార్తిక్ తదితరులు పాల్గొన్నారు.

## అంబర్‌పేట్ ఫ్లై ఓవర్ దశాబ్దాల కల.. నెరవేరింది

**హైద్రాబాద్ జై భీమ్ న్యూస్**

అంబర్‌పేట్ ఫ్లైఓవర్‌పై వాహనాల రాకపోకలు బుధవారం ప్రారంభమయ్యాయి. స్థానిక పార్లమెంట్ సభ్యుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆదేశంతో ఫ్లైఓవర్‌పై రాకపోకలు కొనసాగుతున్నాయి. ఫ్లైఓవర్ పనులు దాదాపుగా పూర్తయ్యాయి. కింద భాగాన రోడ్డు నిర్మాణం, గ్రీనరీ, సుందరీకరణ పనులు పూర్తి చేసి అధికారికంగా మరి కొన్ని రోజుల్లో ఫ్లైఓవర్ ప్రారంభించనున్నారు. అప్పటి వరకు ప్రయాణికుల సౌకర్యార్థం మహాశివరాత్రి నుంచి ఈ పైవంతెనపై రాకపోకలకు అనుమతించాలని కిషన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఆయన నిన్న ఫ్లైఓవర్ పనులను పర్యవేక్షించారు. కేంద్రమంత్రి ఆదేశాలతో ఇవాళ్టి నుంచి ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. అంబర్‌పేట్ ఫ్లై ఓవర్ దశాబ్దాల కల.. దీనికోసం చాన్నాళ్లుగా స్థానికులు, ఈ మార్గంలో రోజూ ప్రయాణించే వారు ఎదురుచూస్తున్నారు. శివరాత్రి సందర్భంగా అందుబాటులోకి రావడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



# ఘనంగా మల్లన్న పెద్దపట్నం కోరమీసాల సామికి మొక్కులు చెల్లించుకున్న భక్తులు

**పసుపుమయమైన మల్లికార్జునుడి క్షేత్రం భక్తిశ్రద్ధలతో పెద్ద పట్నం**

**ఐనవోలు: (జై భీమ్ న్యూస్)**

ఐనవోలు మల్లికార్జునస్వామి ఆలయ పరిసరాలు పసుపు వర్ణం అందుకున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తజనం కోరమీసాల స్వామి నామాన్ని స్మరిస్తూ పంచవర్ణాల పెద్దపట్నాన్ని దాటిన తీరు అందరిలో భక్తిని ప్రేరేపించింది. బలిజ మేడలమ్మ,గొల్ల కేతమ్మ సమేతంగా కొలువుదీరిన మల్లికార్జునుడి దర్శనంతో వేలాది మంది తన్మయత్వం పొందారు.మల్లికార్జునస్వామి దేవస్థానం వద్ద బుధవారం పెద్దపట్నం, స్వామి వారి కళ్యాణ కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు.ఐనవోలు భక్తులతో పోటెత్తింది. పంచవర్ణాలపెద్దపట్నం ఒగ్గు పూజారులు పంచవర్ణాలు (తెలుపు, పసుపు, నీలి, ఎరుపు, ఆకుపచ్చ) రంగు గల పిండితో పెద్దపట్నం వేశారు. భక్తులు చల్లుకున్న బండారితో స్వామి వారి సన్నిధి పసుపు వర్ణ శోభితమైంది. ఒగ్గు పూజారులు పంచవర్ణాల పిండితో పెద్దపట్నం వేశారు. అనంతరం అర్చకులు స్వామివారి ఉత్సవ విగ్రహాలను పెద్దపట్నం వద్దకు తీసుకువచ్చి పూజలు నిర్వహించారు.

**ఒళ్ళంతా బండారు... మనసంతా మల్లన్న**



పసుపును ఒళ్లంతా పూసుకోవడంతోపాటు ఒకరిపై ఒకరు చల్లుకున్నారు. బండారును ఇలా ఇచ్చిపుచ్చుకోవడం ద్వారా మల్లన్నపై భక్తిప్రపత్తులను చాటారు. పెద్దపట్నం కార్యక్రమం నిర్వహించారు. దీంట్లో పాల్గొనేందుకు భక్తులు గంటలపాటు వేచి ఉన్నారు.

**మల్లన్నను దర్శించుకున్న ఎమ్మెల్యే**

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన పెద్ద పట్నం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు ఎమ్మెల్యే నాగరాజుకు ఆశీర్వచనం అందించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు.

# సైబర్ ఇంటిలిజెన్స్ నివేదికలో షాకింగ్ నిజాలు

మొదటి పేజీ తరువాయి

టీం స్పష్టం చేసింది. కేంద్ర హోం మంత్రిత్వ శాఖను, ఆర్బీఐ అధికారులను సైబర్ ఇంటిలిజెన్స్ టీం అలర్ట్ చేసింది.

**ఏటేటా పెరుగుతున్న సైబర్ నేరాలు..**

పెరుగుతున్న టెక్నాలజీకి అనుగుణంగానే సైబర్ నేరాలు కూడా విపరీతంగా పెరిగిపోతున్నాయి. వివిధ రకాల పద్ధతులను పాటించి నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారు. చదువులేని వారితో పాటు విద్యావంతులు, వ్యాపారస్తులు, సంపన్నులు కూడా వీరి వలలో పడి సొమ్ములను పోగొట్టుకుంటున్నారు. మోసాలు చేయడానికి సైబర్ నేరగాళ్లు కొత్త శిక్షణను ఎంచుకుంటున్నారు. అయితే, ప్రతీ ఏటా భారీగా నమోదవుతున్న సైబర్ నేరాల కట్టడికి ప్రజలు అప్రమత్తంగా ఉండడమే మార్గమని పోలీసులు స్పష్టం చేశారు. ముందస్తు అప్రమత్తత, కనీస రక్షణ చర్యలు తీసుకుంటే చోరీలను నివారించే అవకాశం ఉంటుంది. సైబర్ నేరాల్లో కొందరు తెలిగ్గా నేరగాళ్ల బుట్టలో పడిపోతున్నారు. పెట్టుబడులు, క్రిప్టో కరెన్సీ లాంటి ఉదాంతాల్లో ప్రాథమికంగా తక్కువ మొత్తంలో లాభాలు చూపించి రూ. కోట్లల్లో కొట్టేస్తున్నారు. నేరం జరగక సకాలంలో బ్యాంకు ఖాతాలు స్తంభింపజేసి డబ్బు ఇతర ఖాతాల్లోకి బదిలీ కాకుండా చూడడం, ఆ తర్వాత తగిన సాక్ష్యాధారాలు సేకరించి న్యాయ ప్రక్రియ పూర్తి చేసి బాధితులకు డబ్బు తిరిగి అప్పగించడం సుధీర్ఘ ప్రక్రియ. ఈ సవాళ్లను దృష్టిలో ఉంచుకుని అసలు నేరాలు జరగకుండా ప్రజల్లో అవగాహన కలిగేలా ప్రత్యేక కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నారు. అయితే సైబర్ నేరగాళ్లు అనేక రీతులలో వల విసురుతూనే వున్నారు .పోలీసు, సీబీఐ. ఆదాయపు పన్ను శాఖ అధికారుల పేరుతో కూడా బెదిరింపులకు గురవుతున్నారు. వీటికి ప్రభుత్వం ఎన్ని చర్యలు తీసుకుంటున్నా బాధితులు పెరుగుతున్నారే గాని క్రైంరేటు తగ్గడం లేదు. నేషనల్ క్రైమ్ రికార్డుల బ్యూరో ప్రకారం గత ఏడాది 11 లక్షలకు పైగా సైబర్ ఫ్రాడ్ కేసులు నమోదయ్యాయి. పోలీల దృష్టికి రాని కేసులు కూడా వేలు, లక్షల సంఖ్యలోనే ఉంటున్నాయి.

**తెలంగాణలో సైబర్ నేరాల సగటు పెరుగుదల 10–15 శాతం**

గత మూడేళ్ల గణాంకాలు పరిశీలిస్తే రాజధానిలో సగటున 9 నుంచి 10 వేల మధ్య ఇళ్లల్లో దొంగతనాలు, వాహన, సెల్?ఫోన్? చోరీలు రికార్డు కాగా సైబర్ నేరాల సగటు పెరుగుదల 10–15 శాతం కంటే ఎక్కువగా ఉంటోంది. బాధితులు పోగొట్టుకునే సొత్తు రూ. వందల కోట్లలో ఉంటోంది. ఒక్క 2023లోనే హైదరాబాద్ లోని మూడు కమిషనరేట్లలో కలిపి సుమారు రూ.450 కోట్లు పోగొట్టుకున్నట్లు అధికారులు వెల్లడించారు. అయితే దొంగతనాలు, చైన్ స్నాచింగ్ తదితర కేసుల్లో కాజేసిన సొత్తు రికవరీ చేసేందుకు ఎక్కువ అవకాశాలుంటాయి. నిందితుల ప్రమేయం నేరుగా ఉండడం. సీసీ పుటేజీలు, వేలిముద్రలు, ఇతర సాంకేతిక ఆధారాలతో తేలిగ్గా చిక్కుతారు. అయితే సైబర్ నేరాలు ఎక్కడ నుంచి జరుగుతున్నాయో కూడా తెలువదు. సైబర్ నేరాల్లో రికవరీ రేటు మాత్రం సరాసరి 5 శాతం కూడా ఉండడం లేదు. నిందితులు కటకటాలు లెక్కించడమూ కష్టసాధ్యంగా మారుతోంది. ఉదాహరణకు హైదరాబాద్ కమిషనరేట్?లో గతేడాది చోరీ కేసుల్లో మొత్తం రూ.38.38 కోట్లు సొత్తు కాజేయగా పోలీసులు రూ.28.45 కోట్లు రికవరీ చేశారు. అంటే రికవరీ రేటు 74.15 శాతం. అదే సైబర్ నేరాల్లో రికవరీ సమస్యగా మారుతోంది. సైబర్ క్రైమ్ పోలీసులు అంచనా ప్రకారం తెలంగాణలోనే ప్రజలు సైబర్ నేరాల బారినపడి రోజూ సగటున రూ.3 కోట్లకు పైనే పోగొట్టుకుంటున్నారు. వాస్తవానికి సైబర్ నేరగాళ్లు కొల్లగొట్టే సొమ్ము ఇంతకు 10 రెట్ల కంటే ఎక్కువగా ఉంటుందని కూడా పోలీసులు అంటున్నారు.ఒక్క హైదరాబాద్ లోనే రోజుకు రూ. కోటికి పైగా సైబర్ నేరగాళ్ల ఖాతాల్లోకి వెళ్తున్నాయి.

**ఏపీలోనూ పెరిగిన సైబర్ నేరాలు..**

ఆంధ్రప్రదేశ్‌లో గత మూడేళ్లలో సైబర్ నేరగాళ్లు రూ.940 కోట్లు కొల్లగొట్టినట్లు సైబర్ క్రైం పోలీసుల లెక్కలు చెబుతున్నాయి. వెంటనే స్పందించిన పోలీసులు రూ.8.26 కోట్లే తిరిగి రాబట్టగలిగారు. అంటే రికవరీ కేవలం 0.87 శాతమే. మరో రూ.140.40 కోట్లు బ్యాంకుల్లో ఫ్రీజ్ చేయించారు. నేరగాళ్లు వీరి దేశాలు, వివిధ ప్రాంతాలలో మోసాలకు తెగబడుతుండటంతో వారిని పట్టుకోవటం, సొమ్మును రికోవరీ చేయటం పోలీసులకు పెద్ద సవాల్‌గా మారుతోంది. సైబర్ నేరాల సంఖ్య కూడా విపరీతంగా పెరిగిపోయింది. 2014–18 మధ్య ఏపీలో 3,572 సైబర్ నేరాలు నమోదు కాగా, 2019–23 మధ్య 9,849 కేసులు నమోదయ్యాయని పోలీసులు తెలిపారు. గడచిన సంవత్సరంలోనూ సైబర్ నేరాలు భారీగానే నమోదయ్యాయి.

**కొత్త పద్దులలో సైబర్ నేరాలు..**

కేంద్ర హోం మంత్రిత్వ శాఖ పరిధిలోని నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌లో నమోదైన ఫిర్యాదులను పరిశీలించినప్పుడు అనేక నేరాలు వెలుగులోకి వచ్చాయి. అందులో కస్టమర్ సర్వీస్ స్కామ్, వర్చువల్ అరెస్టు స్కామ్ ఎక్కువగా జరిగింది. ముఖ్యంగా ఉత్తర భారతదేశంలో అనేక మంది వర్చువల్ అరెస్టు స్కామ్ బారిన పడుతున్నారు. ఆధార్ కార్డును హ్యాక్ చేసి మోసాలకు పాల్పడేవారు ఇటీవల పెరిగారు. ఆధార్ ఎనెబుల్డ్ పేమెంట్ సిస్టమ్ ద్వారా బాధితుడి బయో మెట్రిక్ హ్యాక్ చేసి మోసాలకు పాల్పడుతున్నారు.మరోవైపు సోషల్ మీడియాను ఉపయోగిస్తున్నారు. మోసాలు పెరిగాయి.

**సైబర్ నేరగాళ్లకు బ్యాంకు ఉద్యోగుల సహకారం..**

కేంద్ర హోంశాఖను సైబర్ ఇంటిలిజెన్స్ అందించిన నివేదికకు బలం చేకూర్చే కేసులను ఇటీవల తెలంగాణ పోలీసులు వెలుగులోకి తెచ్చారు. సైబర్ నేరగాళ్ల ఆగడాలకు కొందరు బ్యాంకు ఉద్యోగులు దన్నుగా ఉంటున్నారు. ఖాతా వివరాలు అడిగో.. ఓటీపీ నంబరు అడిగో%ూ% లేదంటే డిజిటల్ అరెస్టు అయ్యారని భయపెట్టో అమాయక ప్రజలను మోసం చేసి.. వారి నుంచి కోట్లు కొల్లగొడుతున్న సైబర్ నేరగాళ్లకు ఆ ఉద్యోగులే సహకరిస్తున్నారు. సైబర్ నేరగాళ్ల కోసం మ్యూల్ ఖాతాలను సృష్టించి ఆ దొంగ డబ్బు దాచుకునేలా వేర్వేరు ఖాతాలకు బదిలీ చేయించుకునేలా అన్ని విధాలుగా సహకరిస్తున్నారు. తెలుగు రాష్ట్రాలు సహా గుజరాత్, కర్ణాటక, న్యూఢిల్లీ, యూపీ, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, బిహార్‌లో సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు భారీ ఆపరేషన్ నిర్వహించి 52 మంది సైబర్ నేరగాళ్లను అరెస్టు చేశారు. దీంతో బ్యాంకు ఉద్యోగుల సహకారం తేటతెల్లమైంది. ఈ సైబర్ నేరగాళ్లు తెలంగాణలో 74 సైబర్ నేరాలు సహా దేశవ్యాప్తంగా 576 నేరాలకు పాల్పడి రూ.88.32 కోట్లు కొల్లగొట్టారని పోలీసులు తేల్చారు. ఒక్క హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోనే 33 సైబర్ నేరాలకు పాల్పడ్డారు. ఈ కేసుల దర్యాప్తులో సైబర్ నేరగాళ్లకు సహకరిస్తున్న వేర్వేరు బ్యాంకులకు చెందిన నలుగురు ఉద్యోగులను అరెస్టు చేసి కటకటాల్లోకి నెట్టారు. ఈ నలుగురు నేపాల్, చైనాల్లోని ప్రధాన సైబర్ క్రిమినల్స్ ఖాతాలకు రూ.23కోట్లు తరలించినట్లు, దేశవ్యాప్తంగా 20 కేసుల్లో వీరి పాత్ర ఉన్నట్లు తేలింది. సైబర్ క్రిమినల్స్ వద్ద రూ.47.90 లక్షల నగదు, మరో రూ.40లక్షల విలువైన క్రిప్టో కరెన్సీ కలిపి మొత్తం రూ. 87.90లక్షలను స్వాధీనం చేసుకున్నామని హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ వెల్లడించారు. నేరస్థుల ఖాతాల్లో రూ.2.87కోట్లు ఫ్రీజ్ చేశామన్నారు. సైబర్ నేరగాళ్లకు ప్రత్యక్షంగా పరోక్షంగానూ కొందరు బ్యాంకు ఉద్యోగులు సహకరిస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది సైబర్ సెక్యూరిటీ బ్యూరో బ్యాంకర్లకు కొన్ని సూచనలు చేసింది. సైబర్ క్రైం కేసుల్లో బ్యాంకు సిబ్బంది పాత్ర ఏ మాత్రం ఉన్నా అరెస్టులు తప్పవని హెచ్చరించింది. పెద్ద మొత్తంలో డబ్బు జమ చేసే వీలున్న కరెంటు ఖాతాల రూపంలోనే మ్యూల్ ఖాతాలు తెరుస్తున్నారు. ఏదైనా బ్యాంకులో కరెంట్ ఖాతా తెరవాలంటే జీఎస్టీఎన్ నంబర్, కంపెనీ అయితే రిజిస్టర్ ఆఫ్ కంపెనీస్ నంబర్ తప్పని సరి. అయితే డబ్బులకు కక్కుర్తి పడి బ్యాంకు ఉద్యోగులు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు సైబర్ ఫ్రాడ్స్‌లో బయటపడ్డ ఖాతాల్లో చాలావరకు బ్యాంక్ సిబ్బంది సహకారంతో ఫేక్ ఖాతాలు ఓపెన్ అయినట్లు దర్యాప్తు అధికారులు పేర్కొన్నారు. ఏదైనా ప్రజలు అప్రమత్తంగా ఉండటం, బ్యాంకులలో పనిచేసే కాంట్రాక్టు సిబ్బంది, థర్డ్ పార్టీ సంస్థల విషయంలో బ్యాంకు కన్నేసి వుంచడం ద్వారా నేరాలను అరికట్టవచ్చు.ముఖ్యంగా ప్రైవేటు బ్యాంకుల విషయంలోనూ ఆర్బీఐ కఠిన చర్యలు చేపట్టాల్సి ఉంది.

# ఐదు రోజుల నష్టాలకు బ్రేక్

దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం మిశ్రమంగా ముగిసాయి. సెన్సెక్స్ ఐదు రోజుల వరుస నష్టాలకు బ్రేక్ పడింది. ఫైనాన్షియల్, ఎఫ్ఎంసీజీ కంపెనీల షేర్ల లాభాలతో 147.71 పాయింట్ల లాభంతో సెన్సెక్స్ 74,602.12 వద్ద ముగిసింది. ట్రేడింగ్ చివర్లో ఫార్మా, మెటల్, ఐటీ కంపెనీల షేర్లలో అమ్మకాల ఒత్తిడి పెరగడంతో నిఫ్టీ మాత్రం వరుసగా ఆరో రోజూ స్వల్పంగా 5.8 పాయింట్లు నష్టపోయి 22,547.55 వద్ద క్లోజైంది. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల షేర్లలో 17 కంపెనీల షేర్లు లాభాలతో, 13 కంపెనీల షేర్లు నష్టాలతో ముగిశాయి. ఆసియా, అమెరికా మార్కెట్లు బలహీనంగా ఉండడం, కొనసాగుతున్న ఎఫ్‌పీఐల అమ్మకాలతో మదుపరులెవరూ కొనుగోళ్లపై పెద్దగా ఆసక్తి చూపడం లేదు. డాలర్‌తో రూపాయి మారకం రేటు పతనం, ట్రంప్ సుంకాల హెచ్చరికలు కూడా ఇందుకు దోహదం చేస్తున్నాయి. కాగా జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ మంగళవారం నాన్ కన్వర్టబుల్ బాండ్ల జారీ ద్వారా రూ.1,100 కోట్లు సమీకరించింది. ఫారెక్స్ మార్కెట్లో రూపాయి మారకం రేటు మరోసారి 'బేర్'మంది. మంగళవారం ఉదయం డాలర్‌తో 11 పైసల నష్టంతో రూ.86.83 వద్ద ప్రారంభమైన రూపాయి చివరికి 47 పైసల నష్టంతో రూ.87.19 వద్ద ముగిసింది. వచ్చే కొద్ది రోజుల్లో డాలర్‌తో రూపాయి మారకం రేటు రూ.86.85–87.40 మధ్య ట్రేడయ్యే అవకాశం ఉందని మార్కెట్ వర్గాల అంచనా. ముడి చమురు ధర మరింత తగ్గితే తప్ప ఇప్పట్లో డాలర్‌తో రూపాయి మారకం రేటు పుంజుకునే అవకాశం కనిపించడం లేదు.



# న్యాయవాదుల నియంత్రణకే ఈ బిల్లు

మొదటి పేజీ తరువాయి

నాయకులకు గానీ లేకపోవడం గమనార్హం. అలాగే ఏ అడ్వకేట్ అయినా మూడేళ్ళ శిక్ష ఉన్న నేరాలలో శిక్ష పడినా లేదా విచారణ ఎదుర్కొంటున్నా, అతను బార్ కౌన్సిల్ మెంబరుగా పోటీ చేయడానికి అనర్హుడు అనే సవరణ అభ్యర్థుల పైన తప్పుడు కేసులు బనాయించడానికి అవకాశం కల్పించేదిగా ఉంది. ఇది బార్ కౌన్సిల్ ఎన్నికలలో హింసకు దారి తీస్తుంది. అడ్వకేట్స్ కోర్టులు బాయ్‌కాట్ చేయడం, కోర్టు వర్క్ చేయకుండా దూరంగా ఉండటం వంటివి చేయకూడదు అనే సవరణ పూర్తిగా అడ్వకేట్ల హక్కులకు భంగకరం, ప్రజాస్వామ్య విరుద్ధం. అడ్వకేట్స్ బార్ అసోసియేషన్లు క్రింది కోర్టులలో అడ్వకేట్ల సమస్యల పరిష్కారానికి ఏర్పడిన స్వతంత్ర సంస్థలు. ఇప్పటికే వాటి ఎన్నికలను క్రమబద్ధీకరించే పేరుతో, అడ్వకేట్ వెల్ఫేర్ ఫండ్ నియంత్రణ కోసం, బార్ అసోసియేషన్ల పైన బార్ కౌన్సిళ్ళు కొంత ఆధిపత్యం తీసుకున్నాయి. ఇప్పుడు ఈ అడ్వకేట్ ఎమెండ్‌మెంట్ బిల్లు సవరణల ద్వారా బార్ అసోసియేషన్లను పూర్తిగా నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తున్నారు. సర్టిఫికెట్ ఆఫ్ ప్రాక్టీస్ పేరుతో ప్రతి ఐదేళ్ళకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్, ప్లేస్ ఆఫ్ ప్రాక్టీస్, సదరు అడ్వకేట్ రెగ్యులర్ ప్రాక్టీస్ చేస్తూన్నాడా లేదా అని వెరిఫికేషన్... ఇవన్నీ అడ్వకేట్ల హక్కులను కాలరాచి అడ్వకేట్లను నియంత్రించే ప్రయత్నంగానే కనపడుతోంది. విదేశీ లా ఫర్మ్‌లను, విదేశీ లాయర్లను అనుమతించే అధికారం బార్ కౌన్సిల్ పరిధిలో కాకుండా కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉంచే ప్రయత్నం కూడా ఆమోదయోగ్యం కాదు. ఈ బిల్లుకు వ్యతిరేకంగా ఇప్పటికే బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అభ్యంతరాలను కేంద్ర ప్రభుత్వానికి పంపింది. న్యాయవాదుల స్వతంత్రతను, హక్కులను, న్యాయ వ్యవస్థ స్వతంత్ర ప్రతిపత్తిని కాపాడుకోవడానికి ప్రతి బార్ అసోసియేషన్ పూనుకోవాలి. లేనిపక్షంలో న్యాయ వ్యవస్థ తన ఉనికిని కోల్పోతుంది.

## డొనాల్డ్ ట్రంప్ మరో సంచలన నిర్ణయం..

**4 భారతీయ కంపెనీలపై నిషేధం!**

ఈ కంపెనీల కార్యకలాపాల ద్వారా ఇరాన్ కార్యకలాపాలకు నిధులు సమకూరుతున్నాయి. నిషేధించిన నౌకలు వందల మిలియన్ల డాలర్ల విలువైన పది లక్షల బ్యారెళ్ల ముడి చమురును రవాణా చేస్తున్నట్లు వెల్లడించింది. ప్రపంచ భద్రతకు ముప్పు కలిగించేలా ఇరాన్ తన అణ్వాయుధాలు, బాలిస్టిక్ క్షిపణులు, ఉగ్రవాదులకు మద్దతు ఇస్తుందని అమెరికా విదేశాంగ శాఖ తెలిపింది. అమెరికా నాలుగు భారతీయ కంపెనీలను నిషేధించింది.ఖూ స్టేట్ డిపార్ట్‌మెంట్ సోమవారం (ఫిబ్రవరి 24, 2025) నాడు ఈ ప్రకటన చేసింది. ఇరాన్ ముడి చమురు, పెట్రోలియం ఉత్పత్తుల వ్యాపారంలో ఈ కంపెనీలు పాల్గొన్నందున ఈ చర్యలు తీసుకున్నట్లు పేర్కొంది. అలాగే ఇరాన్‌కు చమురు అమ్మకాలను నిలిపివేయడానికి ట్రంప్ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. అమెరికా ట్రెజరీ డిపార్ట్‌మెంట్ విదేశీ ఆస్తుల నియంత్రణ కార్యాలయం, అమెరికా విదేశాంగ శాఖ ఈమేరకు ప్రకటన విడుదల చేసింది. వివిధ దేశాలలో 30 కంటే ఎక్కువ మంది వ్యక్తులతోపాటు నౌకలపై నిషేధం విధించాయి. ఈ జాబితాలో భారతదేశానికి చెందిన నాలుగు కంపెనీలు కూడా ఉన్నాయి. ూఖీూజ, ఖూ స్టేట్ డిపార్ట్‌మెంట్ నుండి అందిన సమాచారం ప్రకారం, ఆ నాలుగు భారతీయ కంపెనీలు – నవీ ముంబైకి చెందిన ఫ్లక్స్ మారిటైమ్ ూూ, నేషనల్ క్యాపిటల్ రీజియన్‌కి చెందిన దీవీ మెరైన్ ూూ, ఆస్టిన్‌షిప్ మేనేజ్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ మరియు తంజావూరుకు చెందిన కాస్మోస్ లైన్స్ ఇంక్. నాలుగు కంపెనీలలో మూడు ఇరానియన్ చమురు, పెట్రోలియం ఉత్పత్తుల రవాణాలో సాంకేతిక నిర్వాహకులుగా ఉన్నందున నిషేధించారు. అయితే ఇరాని యన్ పెట్రోలియం రవాణాలో దాని ప్రమేయం కోసం కాస్మోస్ లైన్స్ నిషేధించినట్లు అమెరికా పేర్కొంది. నిషేధిత జాబితాలో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఎఇ), హాంకాంగ్ నుండి చమురు మధ్యవర్తులు, భారత్ , పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనా, ఇరాన్‌కు చెందిన నేషనల్ ఇరానియన్ ఆయిల్ కంపెనీ అధిపతి, ఇరానియన్ ఆయిల్ టెర్మినల్స్ కంపెనీ నుండి ట్యాంకర్ ఆపరేటర్లు, మేనేజర్లు ఉన్నారని ూఖీూజ తన ప్రకటనలో తెలిపింది. ఈ కంపెనీల కార్యకలాపాల ద్వారా ఇరాన్ కార్యకలాపాలకు నిధులు సమకూరుతున్నాయి. నిషేధించిన నౌకలు వందల మిలియన్ల డాలర్ల విలువైన పది లక్షల బ్యారెళ్ల ముడి చమురును రవాణా చేస్తున్నట్లు వెల్లడించింది. ప్రపంచ భద్రతకు ముప్పు కలిగించేలా ఇరాన్ తన అణ్వాయుధాలు, బాలిస్టిక్ క్షిపణులు, ఉగ్రవాదులకు మద్దతు ఇస్తుందని అమెరికా విదేశాంగ శాఖ తెలిపింది. ఇరాన్ చమురు ఎగుమతులు అనేక అధికార పరిధిలో చట్టవిరుద్ధంగా జరుగుతున్నాయని వెల్లడించింది. ట్రంప్ పరిపాలన తీసుకున్న ఈ చర్యలు ఇరాన్ అస్థిరపరిచే కార్యకలాపాలను ఆపడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు కనిపిస్తోంది.

## క్రిప్టో కరెన్సీ మాటున భారీ మోసం..

**దేశంలోని 60 చోట్ల సీబీఐ దాడులు**

ఓ గ్యారంటీలేదు. ప్రభుత్వాల మద్దతు లేదు. బ్యాంకుల సపోర్ట్ లేదు. అయినా సరే దాని దూకుడు ముందు వజ్రం కూడా వెలవెలబోతోంది. దాని ఊపు ముందు.. బంగారం కూడా ఉసూరుమంటోంది. అరపైసాతో మొదలైన దాని ప్రస్తానం.. కోట్లరూపాయలకు చేరుతోంది. కంప్యూటర్‌లో పుట్టిన డిజిటల్ కరెన్సీగా ఎదిగి.. ఇప్పుడు ప్రపంచాన్నే శాసిస్తోంది. కనిపించవు కానీ కాసులు కురిపిస్తాయి. డబ్బులు ఉన్నట్లే అనిపిస్తాయి కానీ ఉండవు. చేత్తో తాకలేము, పర్సులో పెట్టుకోలేము. ఒక్క కాయిన్ సంపాదిస్తే, సాధిస్తే లైఫ్ సెటిల్..అంతే.. కన్ఫ్యూజింగ్ గా ఉన్నా క్రిప్టో కరెన్సీ అంటే ఇదే. క్రిప్టో వరల్డ్ లో సరికొత్త రికార్డులు క్రియేట్ చేస్తోంది. అన్ని రికార్డులను చెరిపేసి దూసుకెళుతోంది. ఈ నేపథ్యంలోనే అనుమానం వచ్చిన సీబీఐ రంగంలోకి దిగింది. దీని వెనుక జరుగుతున్న అసలు మోసాన్ని బట్టబయలు చేసింది. క్రిప్టోకరెన్సీ మోసానికి సంబంధించిన కేసుల్లో దేశవ్యాప్తంగా 60 చోట్ల సీబీఐ దాడులు చేసింది. ఢిల్లీ చీజ=, పూణే, చండీగఢ్, నాందేడ్, కొల్హాపూర్, బెంగళూరు సహా దేశవ్యాప్తంగా ప్రధాన నగరాల్లో ఈ దాడులు జరుగుతున్నాయి. నకిలీ వెబ్‌సైట్‌లు మరియు ఆన్‌లైన్ మోసం ద్వారా ఈ స్కామ్ జరిగినట్లు సీబీఐ గుర్తించింది. ఇందులో నిందితులు ప్రధాన క్రిప్టో ఎక్స్‌చేంజ్ వెబ్‌సైట్‌లను అనుకరించడం ద్వారా ప్రజలను మోసం చేసినట్లు నిర్ధారించారు. ఈ క్రిప్టోకరెన్సీ స్కామ్ 2015లో ప్రారంభమైంది. అమిత్ భరద్వాజ్ (మరణించిన వ్యక్తి), అజయ్ భరద్వాజ్, వారి ఏజెంట్లు దీనిని నిర్వహించారు. ఈ వ్యక్తులు +ఖుఱఅదీఉఓశీఱఅ పేరుతో అనేక ఇతర పేర్లతో వెబ్‌సైట్‌లను సృష్టించారు. పోంజీ పథకం కింద ప్రజలను క్రిప్టోకరెన్సీలో పెట్టుబడి పెట్టేలా చేశారు. ఈ వెబ్‌సైట్‌లన్నీ వేరియబుల్‌టెక్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా నిర్వహించినట్లు సీబీఐ అధికారులు నిర్ధారణకు వచ్చారు. క్రిప్టోకరెన్సీ మోసానికి పాల్పడిన అమిత్ భరద్వాజ్ (మరణించిన), అజయ్ భరద్వాజ్, ఈ పథకంలో 18 నెలల పాటు బిట్‌కాయిన్‌లో పెట్టుబడి పెట్టమని పెట్టుబడిదారులను కోరారు. దానికి ప్రతిగా వారు 10 శాతం రాబడిని ఇస్తామని హామీ ఇచ్చారు.

## రూపాయికి టారిఫ్‌ల సెగ



అమెరికా టారిఫ్ యుద్ధ అనిశ్చితికి తోడు దిగుమతిదారుల నుంచి డాలర్లకు డిమాండ్ పెరగడంతో రూపాయి విలువ మరింత పతనమైంది. స్టాక్ మార్కెట్ల వరుస పతనం.. ఎఫ్ఐఐలు తరలిపోవడంతో నిత్యం ఒత్తిడిని ఎదుర్కొంటుంది. ఈ నేపథ్యంలోనే మంగళవారం డాలర్‌తో రూపాయి మారకం విలువ ఏకంగా 51 పైసలు క్షీణించి 87.23కు దిగజారింది. ఇంటర్‌బ్యాంక్ ఫారిన్ ఎక్స్ఛేంజీలో డాలర్‌తో రూపాయి విలువ 86.83 వద్ద ప్రారంభమైంది. ఇంట్రాడేలో ఏకంగా 87.23కి పడిపోయింది. తుదకు 51 పైసలు కోల్పోయి 87.23 వద్ద ముగిసింది. ముడి చమురు బ్యారెల్ ధర 0.12 శాతం తగ్గి 74.69 వద్ద ముగిసింది. సోమవారం సెషన్‌లో రూ.6,286.70 కోట్ల ఎఫ్ఐఐలు తరలిపోయాయి. ఈ నెల దాదాపు రూ.30 కోట్ల విదేశీ పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు. పరిస్థితులు ఇలాగే కొనసాగితే డాలరుతో రూపాయి విలువ 90కి చేరినా ఆశ్చర్యపోవాల్సిందేమీ లేదని నిపుణులు పేర్కొంటున్నారు. భారత్‌కు ట్రంప్ ప్రభుత్వం వ్యూహాత్మక భాగస్వామి అని గొప్పలు చెప్పుకుంటున్న బిజెపి ప్రభుత్వానికి ట్రంప్ టారిఫ్‌ల చర్యలతో రూపాయి పతనం, మార్కెట్ల క్షీణతతోనైనా మేలుకొలుపు కావాలని నిపుణులు సూచిస్తున్నారు.

## వారానికి 47.5 గంటల పని



ఉద్యోగ, కార్మికుల పని గంటల పెంపునపై కార్పొరేట్లు తమదైన ఎత్తుగడలను, సన్నాయి నొక్కులను నొక్కుతున్నారు. కార్మిక చట్టాలను మార్చాలనే మోడీ సర్కార్ వ్యూహాలకు అనుగుణంగా మరో కార్పొరేట్ దిగ్గజం ప్రతినిధి చిలుకపలుకులు పలికారు. తాజాగా క్యాప్‌జెమినీ ఇండియా సిఇఒ అశ్విన్ యార్ది మాట్లాడుతూ.. రోజుకు 9.30 గంటల చొప్పున వారానికి ఐదు రోజులు పనిచేస్తే చాలని పేర్కొన్నారు. మంగళవారం నాస్కామ్ టెక్నాలజీ అండ్ లీడర్‌షిప్ ఫోరంలో అశ్విన్ మాట్లాడుతూ.. వారంలో ఐదు రోజులు పని చేస్తే చాలని పేర్కొన్నారు. వారాంతంలో ఇ మెయిల్స్ పంపొద్దన్నారు. నాలుగేళ్లుగా తాను అదే పని చేస్తున్నానని తెలిపారు. కొన్ని సార్లు వారాంతాల్లో పని చేస్తానని చెప్పారు. పని వేళల కంటే ఉత్పాదకతే ముఖ్యమని నాస్కామ్ ఛైర్‌పర్సన్ సింధు గంగాధరన్ పేర్కొన్నారు. భారత్‌లోని యువత వారానికి 70 గంటల పాటు పని చేయాలని ఇటీవల ఇన్ఫోసిస్ అధినేత నారాయణ మూర్తి తొలుత చర్చ లేపిన విషయం తెలిసిందే. ఆ తర్వాత ఎల్‌అండ్‌టి ఛైర్మన్ ఎస్ఎన్ సుబ్రహ్మణ్యన్ తన ప్రభుత్వ భక్తిని మరింత ప్రదర్శించుకోవడానికి ఏకంగా 90 గంటలు పని చేయాలని వ్యాఖ్యానించారు.

## మరింత కట్టుదిట్టంగా ఈక్విటీ డెరివేటివ్స్

ఈక్విటీ డెరివేటివ్స్‌లో ట్రేడింగ్‌ను మరింత కట్టుదిట్టం చేయాలని మార్కెట్ నియంత్రణ మండలి సెబీ భావిస్తోంది. ఇందుకోసం కొన్ని ప్రతిపాదనలతో ఒక చర్చా పత్రం విడుదల చేసింది. ఈ చర్చా పత్రంపై సంబంధిత వర్గాలు వచ్చే నెల 17వ తేదీలోగా తమ సూచనలు, అభిప్రాయాలు తెలియజేయాలని కోరింది. ఎఫ్ అండ్ ఓ, ఓపెన్ ఇంట్రెస్ట్ (ఓఐ) విభాగాల్లో ట్రేడింగ్ సామర్ధ్యం, వెసులుబాటు పెంచడం, రియల్ టైమ్ సమాచారం ఆధారంగా ఎప్పటికప్పుడు నష్ట భయ (రిస్క్) పర్యవేక్షణను మరింత పటిష్ఠం చేసే కృషిలో భాగంగా సెబీ ఈ చర్చా పత్రం విడుదల చేసింది. ఈ ప్రతిపాదనలు అమల్లోకి వస్తే ఎఫ్ అండ్ ఓ, ఓఐ పొజిషన్లపై మదుపరులు రియల్ టైమ్ సమాచారం ఆధారంగా సరైన నిర్ణయాలు తీసుకోగలుగుతారు. దీనికి తోడు నష్టభయాలను సమర్ధవంతంగా నిర్వహించుకోవడంతో పాటు మేలైన నిర్ణయాలు తీసుకునేందుకు అవకాశం ఉంటుందని భావిస్తున్నారు.



# సిద్ధమైన సనాతన రాజ్యాంగం

మొదటి పేజీ తరువాయి

నిర్ణయాల ఆధారంగా ఋషి రాజ్యాంగాన్ని రూపొందించారు. అంటే దాదాపు రెండున్నర దశాబ్దాలుగా చాపకింద నీరులాగా ప్రత్యామ్నాయ రాజ్యాంగాన్ని రూపొందించేందుకు సాగుతున్న ప్రయత్నాలను అటు ప్రభుత్వాలు, ఇటు పౌరసమాజం గుర్తించలేకపోయిందని అర్థమవతుంది.

ఈ ప్రత్యామ్నాయ రాజ్యాంగాన్ని రూపొందించటానికి రెండున్నర దశాబ్దాలు గడువు తీసుకున్న శక్తులు, సంస్థలూ దీన్ని ఊరూరా ప్రచారం చేయటానికి మరో రెండు దశాబ్దాలు లక్ష్యంగా పెట్టుకున్నారు. రాజ్యాంగ పరిషత్ రచించిన రాజ్యాంగం హైందవ విలువలకు స్థానం కల్పించలేదు కనుక దీని స్థానంలో స్వంత రాజ్యాంగాన్ని రూపొందించుకోవాలని ఆరెస్సెస్ బహిరంగంగానే పిలుపునిచ్చిన సంగతి చారిత్రక సత్యం. 1999లో వాజ్పేయి ప్రభుత్వం అధికారానికి వచ్చినప్పుడు ఈ దిశగా తీసుకున్న తొలిచర్య రాజ్యాంగ పనివిధానాన్ని సమీక్షించేందుకు జస్టిస్ వెంకటాచల్లయ్య నేతృత్వంలో ఓ కమిషన్‌ను నియమించారు. సదరు కమిషన్ అధ్యయనం పేరుతో జరిగిన చర్చల రూపంలో సంఘపరివారం తన రాజకీయ ఎజెండాను ముందుకు తెచ్చింది. ప్రస్తుతం కుంభమేళాలో ఆవిష్కరించబడిన సనాతన రాజ్యాంగం వాజ్పేయి కృషికి కొనసాగింపా లేక కొత్త ప్రయత్నమా అన్నది పరిశీలించాలి. ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే అందుబాటులో ఉన్న వార్తల మేరకు ఈ రాజ్యాంగ ప్రతిని ప్రదర్శించారే తప్ప సాధారణ ప్రజానీకానికి అందుబాటులోకి తీసుకువచ్చే విధంగా అచ్చేయలేదు.

భారతదేశాన్ని సనాతన దేశంగా మార్చే వైపుగా మహాకుంభమేళాలో సాధువులు తొలి అడుగు వేశారని ఉత్తరప్రదేశ్ నుండి వెలువడే అమర్ ఉజాలా పత్రిక ప్రచురించింది. ఈ పత్రిక వార్తా కథనం ప్రకారం వసుధైక కుటుంబకం ఆధారంగా రూపొందించిన ఈ రాజ్యాంగాన్ని ఋషి రాజ్యాంగం అని పిలుస్తారు. ఈ రాజ్యాంగాన్ని అమలు చేసే ప్రధాన కేంద్రం ఋషికేశ్‌లోని ఋషి దర్శన్ ప్రాంతంలో ఉంటుందన్నది వార్త. అయితే ఈ ప్రతిపాదిత ప్రత్యామ్నాయ రాజ్యాంగం కూడా వికేంద్రీకరణ సూత్రాన్ని పాటిస్తోంది కానీ ఇది మనందరికీ తెలిసిన వికేంద్రీకరణ సూత్రం కాదు. ఈ రాజ్యాంగ ఆవిష్కరణలో పాల్గొన్న వక్తలు వెల్లడించిన వివరాల ప్రకారం మరో నాలుగు తాత్కాలిక ప్రధాన కార్యాలయాలు కూడా ప్రారంభం కానున్నాయి. ప్రయాగ్‌రాజ్, హరిద్వార్, నాసిక్, ఉజ్జైన్‌లు ఈ తాత్కాలిక కార్యాలయాలకు కేంద్రాలుగా ఉండనున్నట్లు తెలుస్తోంది. ప్రతి మహాకుంభమేళాను ఇకపై ధార్మిక పార్లమెంట్‌గా పరిగణిస్తారు. తదనుగుణంగా కుంభమేళాలోనే సనాతన రాజ్యాంగాధిపతి దేశాన్ని ఉద్దేశించి సందేశమిస్తారు. ప్రస్తుతం ప్రతి విజయదశమి రోజునా ఆరెస్సెస్ చాలక్ తన శ్రేణులనుద్దేశించి ప్రసంగిస్తున్న తరహాలో అన్నమాట.

**ప్రతి ఒక్క సనాతనికి బాధ్యతలు..**

ఈ రాజ్యాంగం ప్రకారం దేశంలోని ప్రజల సనాతనులు, సనాతనేతరులు అని విభజించబడి అర్థమవుతుంది. వైదిక సనాతన గ్రంథాలను, పురాణాలను ఆధారంగా చేసుకొని తూర్పు-పశ్చిమ, ఉత్తర-దక్షిణ ప్రాంతాలకు చెందిన 15మంది సాధు-సంతుల బృందం ప్రణాళికను రూపొందించింది. ప్రణాళిక ప్రకారం ప్రతి ఒక్క సనాతకు ఒక గ్రామాన్ని అప్పజెప్తారు. వారికి కేటాయించిన గ్రామాన్ని సనాతన గ్రామం చేయడానికి బాధ్యతలు ఇవ్వనున్నారు. ఆధునిక ప్రజాస్వామ్యంలో దీనిని పోలిన పథకం ప్రధానమంత్రి ఆదర్శ గ్రామీణ యోజన. ఈ ప్రయోగాన్ని మొదట మూడు వందల గ్రామాల్లో చేపడతారు. అందులో వచ్చిన అనుభవాలు, నేర్చుకున్న గుణపాఠాల నుండి తుది ప్రణాళికను రూపొందించి నాలుగు లక్షల గ్రామాలకు విస్తరిస్తారు. తొలిదశలో ఎంపిక చేసుకున్న మూడు వందల గ్రామాలు ఒడిషా. పంజాబ్, పశ్చిమబెంగాల్‌లలో ఉన్నాయి. ఇందులో పశ్చిమబెంగాల్, పంజాబ్‌లో రానున్న ఒకటి రెండేళ్లలో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్నాయి.

**హిందూ దేశాన్ని ప్రకటించటమే సంకల్పం..**

గ్రామాలను సనాతన గ్రామాలుగా ప్రకటించడం వెనక ఉన్న దేశంలో రాజకీయ లక్ష్యం ఈ లౌకిక ప్రజాతంత్ర గణతంత్ర భారతదేశాన్ని సనాతన హిందూ దేశంగా రూపాంతరం చెందించటమే. రెండో దశలో నాలుగు లక్షల గ్రామాల వరకు ఈ సనాతన రాజ్యాంగాన్ని వ్యాపింపచేసిన తర్వాత మూడో దశలో మిగిలిన గ్రామాలకు విస్తరిస్తారు. అంతిమంగా దేశంలోని ఐదున్నర లక్షల గ్రామాలను సనాతన గ్రామాలుగా మార్చే ప్రణాళిక ఉంది. దీనితో పాటుగా వచ్చే 20 ఏళ్లలో భారతదేశం వైదిక సనాతన హిందూ దేశంగా ప్రకటించేలా సాధు- సంతులు మహాకుంభమేళాలో సంకల్పించారు. వలసపాలన నుండి విముక్తి పొంది స్వతంత్ర దేశంగా గుర్తింపు పొందేందుకు లౌకిక ప్రజాతంత్ర గణతంత్ర భారతాన్ని నిర్మించే ప్రక్రియలో తొలి స్వతంత్ర రాజ్యాంగాన్ని రూపొందించేందుకు దేశంలోని ప్రజలందరూ (హిందూమహాసభ, ఆరెస్సెస్‌లు మినహా) దాదాపు రెండువందల ఏళ్ల పాటు పోరాడారు. అదే తరహాలో ఆరెస్సెస్ ప్రారంభం అయిన రెండువందల ఏళ్లలో భారత దేశాన్ని వైదిక సనాతన హిందూ రాజ్యంగా ఆవిష్కృతం చేయడానికి సంకల్పించినట్లు ఈ సమాచారం ద్వారా అర్థమవుతుంది.

**2001లో కుంభమేళాతో ప్రారంభం..**

శ్రీకాశీ సుమేర్‌పీఠం శంకరాచార్య స్వామి నరేంద్రానంద్ స్వామి 2001 నుంచి సనాతన రాజ్యాంగం కోసం పని చేస్తున్నారు. 'ప్రతి గ్రామంలో ఒక్కొక్క రుషి మోహరింపు ఉంటుంది. గ్రామ దేవతలను ఆధారంగా చేసుకొని వాడ, గ్రామ, మండలాలవారిగా పనులు జరుగుతాయి. గ్రామాలలో ఉండేవారు గ్రామ దేవతలను పూజించడం తమ రోజువారి విధిగా కొనసాగుతుంది. మతమార్పిడిని ఆపడానికి దీనిని అమలు చేయడం అవసరం ఎంతైనా ఉంది.' అని నరేంద్రానంద స్వామి తెలిపారు.

**ఋషి నుంచి బ్రహ్మర్షి వరకు ప్రయాణం..**

సనాతన రాజ్యాంగంలో రుషి తొలి యూనిట్‌గా ఉంటారు. ఇందులో యమం, జపం, తపం, సంయమం, నియమం ఆధారంగా చేసుకొని యువకులను సమీకరిస్తారు. రుషి తర్వాత రాజర్షి, మహర్షి, దేవర్షి ఇంకా బ్రహ్మర్షిలు పాలకులుగా ఉంటారు. ఉత్తమ పండితుడు, సన్యాసి, శాస్త్రాలలో జ్ఞానం ఉన్న వ్యక్తిని అన్నింటికన్నా ఉన్నతమైన బ్రహ్మర్షి పదవికి నియమించడం జరుగుతుంది. ఆ తరువాత మహాకుంభ మేళాలో బ్రహ్మర్షిని ఉన్నారు. సనాతన రాజ్యాంగంలో ప్రపంచశాంతి ప్రణాళికను కూడా ప్రతిపాదిస్తోందనీ, ఆ దిశగా అన్నింటికన్నా ముందు వ్యక్తి, ఇల్లు, వాడ, గ్రామం, మండలం, జిల్లా, రాష్ట్రం, దేశం, ఖండం, భూమి ఆ తర్వాత చివరికి ప్రపంచాన్ని ఉంచారు.

**17 ప్రచారాలు..**

సనాతన రాజ్యాంగం ప్రకారం 17 విప్లవాల లక్ష్యంగా పని చేస్తుంది. మేధో విప్లవం, సాధనా విప్లవం, సంపర్క విప్లవం, సేవా విప్లవం, మత జాగురుకత, సంస్కార విప్లవం, గోవిప్లవం, యువవిప్లవం, వ్యవస్థ విప్లవం, మహిళా విప్లవం, సమతావిప్లవం, శిక్షా విప్లవం, ఆరోగ్య విప్లవం, వ్యసన విముక్తి, సాధికారత, హరితవిప్లవం ఇవి.

**కుంభమేళాలో నియామకం..**

బ్రహ్మర్షి నుంచి సేవా సైనిక్ వరకు ఎంపిక వేరే వేరే చోట్ల జరుగుతుంది. ఇందులో బ్రహ్మర్షిని ప్రయాగ్‌రాజ్ మహాకుంభమేళాలో ఎన్నుకుంటారు. మహర్షిని హరిద్వార్‌లో జరిగే అర్ధకుంభమేళాలో ఎన్నుకుంటారు. ఆ తర్వాత రాజార్షిని నాసిక్ మహాకుంభమేళాలో, రుషి ఎన్నిక ఉజ్జయిని మహాకుంభమేళాలో, ఆచార్య నియామకం ప్రయాగ్‌రాజ్ కుంభమేళాలో, ధర్మరక్షకుడి నియామకం హరిద్వార్ కుంభమేళాలో జరుగుతుంది. అయితే సేవావ్రతి నియామకం మాత్రం ప్రతీ సంవత్సరం ఋషి పంచమినాడు, సేవాసైనిక్ నియామకం ప్రతి మకర సంక్రాంతినాడు జరుగుతుంది. ప్రస్తుతం నిచ్చెనమెట్ల తరహాలో ఉన్న బ్యూరోక్రసీ స్థానంలో ఈ సనాతన రాజ్యాంగ యంత్రం బాధ్యతలు చేపడుతుంది. సనాతన రాజ్యాంగం విజయవంతంగా అమలుకావడానికి మూడు భావనలను రూపకర్తలు ఏర్పాటు చేశారు. అందులో లక్ష్యం, మార్గం ఇంకా మార్గదర్శనాన్ని ఉంచారు. సనాతన రాజ్యాంగ లక్ష్యం ప్రపంచంలో శాంతి నెలకొల్పడం, ఆవును కేంద్రంగా ఉంచి ప్రపంచశాంతి ప్రణాళిక ఏర్పాటు చేయడం జరిగింది. దీని ముఖ్య ఉద్దేశ్యం జనజాగృతి ద్వారా సమాజంలో మహావిప్లవం తేవడం. దీని కోసం సుదర్శన చక్రాన్ని కేంద్రబిందువుగా మహావిప్లవం ప్రణాళికను ఏర్పాటు చేశారు. ప్రపంచంలో మత కార్యకలాపాలను నియంత్రించడానికి వారి జీవితాన్ని సమర్పించారు. దీనికోసం ఋషితంత్ర వ్యవస్థను ప్రవేశపెట్టారు. ప్రజాస్వామ్యంలో మాదిరి ఋషితంత్ర వ్యవస్థలోనూ నేతలను ఎన్నుకుంటారు. ఋషి రాజ్యాంగంలో మూడు భావనలు, మూడు వందలకు పైగా సూత్రీకరణ వ్యాసాలు ప్రవేశపెట్టబడ్డాయి. ఇందులో మొత్తం కలుపుకొని 1056 మతవిభాగాలు ప్రస్తావించబడ్డాయి. ఇవన్నీ వినటానికి వింతగానూ, ఎబ్బెట్టుగానూ ఉన్నా కళ్ల ముందు జరుగుతున్న కథనాన్ని చూడటం వివేకవంతుల లక్షణం కాదు. వందేళ్ల క్రితం గాంధీని, నెహ్రూలను కించపరిచేవిధంగా మాట్లాడటం లోకరీతి అవుతుందని ఎవరూ ఊహించలేదు. రెండువందల ఏళ్ల క్రితం అయోధ్యలోని బాబ్రీ మసీదు కూల్చివేత వాస్తవ రూపం దాలుస్తుందని ఎవరూ ఊహించలేదు. ఇలా చెప్పుకుంటూ పోతే సంఘపరివారం ఎజెండాను ముందుకు నడపటంలో ఎంత సంయమనం, ఓపిక, పట్టుదలతో వ్యవహరిస్తున్నారో తెలుసుకునేందుకు ఎన్నో కనిపిస్తున్నాయి. కాబట్టి అమర్ ఉజాల కథనాన్ని తేలిగ్గా కొట్టి పారేయటానికి వీల్లేదు.

# పింఛన్ విషయంలో కేంద్రం కీలక చర్యలు..

### ఇకపై ప్రతి పౌరుడికి నెలనెలా రంచన్‌గా పింఛన్..!



60 ఏళ్ల తర్వాత ప్రతి పౌరుడికి ఆర్థిక భద్రత కల్పించడానికి ప్రభుత్వం సార్వత్రిక పెన్షన్ పథకంపై కృషి చేస్తోందని పలు నివేదికలు వెల్లడిస్తున్నాయి. ప్రభుత్వం తీసుకునే చర్యలు ప్రభుత్వ, ప్రైవేట్ రంగ ఉద్యోగులకు మాత్రమే కాకుండా, స్వయం ఉపాధి పొందుతున్న వ్యక్తులు, వ్యాపారులు, అసంఘటిత రంగంలోని కార్మికులకు కూడా పెన్షన్ ప్రయోజనాలను అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్ఓ) కింద అంబ్రెల్లా పెన్షన్ పథకంపై కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ చర్చలు ప్రారంభించిందని నిపుణులు చెబుతున్నారు. ఈ పథకం స్వచ్ఛంద పింఛన్ పథకం. అంటే ఇది ఉపాధికి అనుసంధానించరు. 60 ఏళ్ల తర్వాత ఎవరైనా చందా చెల్లించి పెన్షన్ పొందేలా ఈ కొత్త స్కీమ్‌ను లాంచ్ చేసే అవకాశం ఉంది. ఈ పథకాన్ని అమలు చేయడానికి ప్రభుత్వం విస్తృతమైన చర్యలు తీసుకుంటుంది. బ్లూప్రింట్ ఖరారు అయిన తర్వాత అధికారికంగా అమలు చేయడానికి ముందు కార్మిక మంత్రిత్వ శాఖ వాటాదారులను సంప్రదిస్తుంది. ఈ కొత్త పెన్షన్ ప్రక్రియను క్రమబద్ధీకరించడానికి, కవరేజీని పెంచడానికి ఇప్పటికే ఉన్న పెన్షన్ పథకాలను విలీనం చేసే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ పథకం ప్రస్తుతం పెన్షన్ పథకం లేని అసంఘటిత రంగంలోని కార్మికులు, వ్యాపారులు, స్వయం ఉపాధి పొందుతున్న వ్యక్తులకు ప్రయోజనం చేకూర్చడం లక్ష్యంగా పెట్టుకుంది. సార్వత్రిక పెన్షన్ పథకాన్ని మరింత ఆకర్షణీయంగా మార్చడానికి, ప్రస్తుత ప్రభుత్వ పెన్షన్ పథకాలను దానిలో విలీనం చేయవచ్చు, ప్రధాన మంత్రి శ్రమ యోగి మంధన్ యోజన (పీఎంఎస్‌వైఎం), వ్యాపారులు, స్వయం ఉపాధి పొందుతున్న వారి కోసం జాతీయ పెన్షన్ పథకం (ఎన్‌పీఎస్-ట్రేడర్స్) రెండు పథకాలు 60 సంవత్సరాల తర్వాత నెలకు 3,000 పెన్షన్ను అందిస్తాయి . చందాదారులు నమోదు చేసుకునే వయస్సును బట్టి నెలకు 755 నుండి 200 వరకు చెల్లిస్తారు, ప్రభుత్వం వారి సహకారాన్ని జమ చేస్తుంది. ప్రస్తుతం కేంద్రం ప్రకటించే సార్వత్రిక పెన్షన్ పథకం గేమ్-ఛేంజర్ కావచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. లక్షలాది మందికి వారి పదవీ విరమణ సంవత్సరాల్లో ఆర్థిక భద్రతను నిర్ధారిస్తుంది. ఈ పథకం విజయవంతంగా అమలు చేస్తే ప్రతి పౌరుడు వయస్సులో ఉన్నప్పుడు తమ కాంట్రిబ్యూషన్ జమ చేయడం ద్వారా వృద్ధాప్యంలో పింఛన్ పొందడానికి వీలు కల్పిస్తుంది.

# కొంపముంచిన వాన.. ఆసీస్, సఫారీ మ్యాచ్ రద్దు

ఛాంపియన్స్ ట్రోఫీలో భాగంగా రావల్పిండి స్టేడియం వేదికగా ఆస్ట్రేలియా, సౌతాఫ్రికా మధ్య జరిగాల్సిన మ్యాచ్ టాస్ పడకుండా వర్షం కారణంగా రద్దైంది. సోమవారం టాస్ పడే సమయానికి వర్షం కాస్త తెరిపి ఇచ్చిన.. ఆ తర్వాత వెంటనే కురవడం మొదలైంది. అయితే వర్షం తగ్గగానే మ్యాచ్‌ను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకొని సిద్ధంగా ఉన్నారు. ఎంతకీ వర్షం తగ్గకపోవడంతో కనీసం 20 ఓవర్ల మ్యాచ్ అయినా.. నిర్వహిస్తారని అంతా అనుకున్నారు. కానీ, వర్షం మాత్రం ఏ మాత్రం తగ్గు ముఖం పట్టలేదు. దీంతో మ్యాచ్‌ని రద్దు చేసి ఇరు జట్లకు చెరో పాయింట్‌ను ఇచ్చారు. దీంతో ఇప్పటికే గ్రూప్-బిలో చెరో మ్యాచ్ గెలిచిన ఆస్ట్రేలియా, సౌతాఫ్రికా జట్లు ఖాతాలో మూడు, మూడు పాయింట్లు చేరాయి. దీంతో ఛాంపియన్స్ ట్రోఫీలో అస్ట్రేలియా ఆడిన చివరి ఎనిమిది మ్యాచుల్లో నాలుగు రద్దు కావడం.. లేదా ఫలితం రాకుండా ఉండిపోవడం విశేషం. అయితే గ్రూప్-బిలో పాయింట్ల పట్టికలో చివరి రెండు స్థానాల్లో ఉన్న ఇంగ్లండ్, అఫ్గానిస్థాన్‌కు



బుధవారం జరిగే మ్యాచ్ కీలకమైంది. ఈ మ్యాచ్‌లో ఓడిపోయిన జట్టు ఆ తర్వాత మ్యాచ్ గెలిచినా లాభం ఉండదు. ఆ జట్టు భవిష్యత్తు ఇతర జట్ల గెలుపోటములపై ఆధారపడి ఉంటుంది. మరోవైపు నెట్‌రన్ రేటుతో ప్రథమ స్థానంలో ఉన్న సౌతాఫ్రికా మాత్రం తర్వాతి మ్యాచ్‌లో నెగ్గితే.. నేరుగా సెమీఫైనల్‌కు వెళ్లనుంది.

## చెలరేగిన ఢిల్లీ బౌలర్లు



మహిళల ప్రిమియర్ లీగ్(డబ్ల్యుపిఎల్)లో గుజరాత్ జెయింట్స్‌పై ఢిల్లీ క్యాపిటల్స్ ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి తొలుత బౌలింగ్ ఎంచుకున్న ఢిల్లీ కెప్టెన్ లానింగ్ నమ్మకాన్ని బౌలర్లు వమ్ము చేయలేదు. ఢిల్లీ బౌలర్లు శిఖా పాండే(2/18), మారిజన్ కాప్(2/17), (4-1-17-2), అన్నాబెల్ సదర్‌ల్యాండ్(2/20)కి తోడు టిటాస్ సధు, జెస్ జొనాస్సెన్ తలా ఒక వికెట్‌తో చెలరేగారు. దీంతో గుజరాత్‌ను 127పరుగులకే పరిమితమైంది. ఆ లక్ష్యాన్ని ఢిల్లీ క్యాపిటల్స్ 15.1ఓవర్లలో 4వికెట్ల నష్టానికి 131పరుగులు చేసి విజయం సాధించింది. ఢిల్లీ బ్యాటర్లు జొన్నాసెన్(61బీ 32బంతుల్లో 9ఫోర్లు, 2 సిక్సర్లు), షెఫాలీ వర్మ(44బీ 27బంతుల్లో 5ఫోర్లు, 3సిక్సర్లు) కీలకపాత్ర పోసించారు. అంతకుముందు గుజరాత్ బ్యాటర్లలో భారతి ఫుల్మలి (40నాటౌట్‌బీ 29బంతుల్లో, 4ఫోర్లు, 2సిక్సర్లు) ఒక్కరే చెప్పుకోదగ్గ స్కోర్ చేసింది. భారతి ఇన్నింగ్స్ చివరి వరకు క్రీజ్‌లో నిలిచింది. ఆ తర్వాత డియాంద్రా డొటిన్(26), తనూజా కన్వర్(16), బెత్ మూనీ(10) మాత్రమే రెండంకెల స్కోర్లు చేశారు. హర్లీన్ డియోల్ 5, ఫోబ్ లిచ్‌ఫీల్డ్ 0, కెప్టెన్ ఆష్లే గార్డ్‌నర్ 3, కశ్వీ గౌతమ్ 0, సిమ్రన్ షేక్ 5, మేఘనా సింగ్ 0 పరుగులకు ఔటయ్యారు. ప్రియా మిశ్రా ఒక్క పరుగుతో అజేయంగా నిలిచింది.

## పాక్ చెత్త ప్రదర్శన.. ఆయనే కారణం



ఈ ఏడాది ఐసిసి ఛాంపియన్స్ ట్రోఫీకి ఆతిథ్యం ఇస్తున్న పాకిస్థాన్.. ఆటలో మాత్రం చెత్త ప్రదర్శన చేస్తోంది. ఆడిన రెండు మ్యాచుల్లో ఓటమిపాలైన జట్టు సెమీస్ ఆశలను దూరం చేసుకుంది. దీంతో పాకిస్థాన్ ఆటతీరుపై సర్వత్ర విమర్శల వర్షం కురుస్తోంది. ఇప్పటికే పలువురు మాజీలు జట్టుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తాజాగా పాకిస్థాన్ క్రికెట్ బోర్డు మాజీ ఛైర్మన్ నజామ్ సేథి జట్టుపై విమర్శలు చేశారు. పాక్ జట్టు ఇలా కావడానికి ఆ దేశ మాజీ కెప్టెన్ ఇమ్రాన్ ఖాన్ కారణమని అయన మండిపడ్డారు. 'పాకిస్థాన్ జట్టు ఒకప్పుడు ప్రపంచంలో నెంబర్.1గా ఉండేది. 2019 నుంచి పాకిస్థాన్ క్రికెట్ పతనం మొదలైంది. అప్పటి ప్రధాని ఇమ్రాన్ ఖాన్ నేతృత్వంలోని మేనేజ్‌మెంట్ తీసుకున్న నిర్ణయాలే ఇందకు కారణం. దేశవాళీ క్రికెట్‌ను నాశనం చేశారు. కోచ్‌ల ఎంపిక, ఇష్టమైన వారిని సెలెక్టర్లుగా చేయడం, ఇలా చాలా రాజకీయాలు జరిగాయి. జట్టులో సభ్యులు గ్రూప్‌లుగా ఏర్పడటం.. సభ్యులతో కెప్టెన్‌కి పడకపోవటం వంటి అంశాలు ఈ దారుణానికి కారణం' అని సేథి అన్నారు.

## న్యూజిలాండ్‌తో మ్యాచ్‌కు దూరం కానున్న టీమిండియా స్టార్ ప్లేయర్?



ఛాంపియన్స్ ట్రోఫీలో టీమిండియా ఇప్పటి వరకు 2 మ్యాచ్‌లు ఆడింది. రెండు మ్యాచ్‌ల్లోనూ విజయం సాధించడం ద్వారా టీమిండియా సెమీఫైనల్‌కు అర్హత సాధించింది. ఇప్పుడు రోహిత్ అండ్ కంపెనీ తదుపరి మ్యాచ్ న్యూజిలాండ్‌తో మార్చి 2న జరగనుంది. ఈ మ్యాచ్‌లో టీమ్ ఇండియా అతిపెద్ద మ్యాచ్ విన్నింగ్ ప్లేయర్‌కు రెస్ట్ ఇవ్వాలనే చర్చ జరుగుతోంది. ఈ మేరకు ఇంగ్లండ్ మాజీ క్రికెటర్ డారెన్ గోఫ్ ఓ సలహా ఇచ్చాడు. న్యూజిలాండ్‌తో మూడో లీగ్ మ్యాచ్‌కు ముందు ఇంగ్లండ్ మాజీ ఫాస్ట్ బౌలర్ డారెన్ గోఫ్ మాట్లాడుతూ.. టీమిండియా బహుశా షమీకి విశ్రాంతి ఇవ్వొచ్చు. పాకిస్థాన్‌పై టీమిండియా అద్భుతంగా రాణించింది. జట్టుకు మంచి బ్యాటింగ్ లైనప్ ఉన్నప్పుడు మరో స్పిన్నర్‌ని ప్రయత్నించవచ్చు. దుబాయ్‌లో మరొక స్పిన్నర్‌ని తీసుకోవచ్చు. టీమ్ ఇండియా ఇప్పటికే సెమీ-ఫైనల్‌కు అర్హత సాధించింది. కాబట్టి న్యూజిలాండ్‌తో మ్యాచ్ కేవలం నామమాత్రంగానే ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఇటువంటి పరిస్థితిలో కెప్టెన్ రోహిత్ శర్మ ఈ మ్యాచ్ నుండి ఫాస్ట్ బౌలర్ మహ్మద్ షమీకి విశ్రాంతి ఇవ్వొచ్చని ఆయన అంచనా వేశారు. చాలా కాలం తర్వాత మహ్మద్ షమీ మళ్లీ టీమ్ ఇండియాలోకి వచ్చాడు. బంగ్లాదేశ్‌తో ఆడిన తొలి మ్యాచ్‌లో అద్భుత బౌలింగ్ ప్రదర్శించిన షమీ ఈ మ్యాచ్‌లో 5 వికెట్లు తీశాడు. పాకిస్థాన్‌పై షమీ బౌలింగ్ బాగానే ఉంది. ఈ మ్యాచ్‌లో షమీ 8 ఓవర్లలో 43 పరుగులు చేసినప్పటికీ అతనికి వికెట్ దక్కలేదు. షమీ మ్యాచ్ ప్రారంభంలో కొంత ఇబ్బంది పడుతూ కనిపించాడు. దీని కారణంగా అతను కొంత సమయం మైదానం నుండి బయటకు వెళ్లవలసి వచ్చింది. మరి న్యూజిలాండ్‌తో మ్యాచ్‌లో షమీకి విశ్రాంతినిస్తారా లేదా అనేది చూడాలి. ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీలో భాగంగా ఇప్పటివరకు రెండు మ్యాచ్‌లు ఆడిన టీమిండియా విజయం సాధించింది. బంగ్లాదేశ్‌తో జరిగిన మొదటి మ్యాచ్‌లో టీమిండియా ఘన విజయం సాధించగా.. ఫిబ్రవరి 23న పాక్‌తో జరిగిన పోరులో భారత్ జట్టు ఘనవిజయం సాధించి సెమీస్‌కు బెర్త్‌ను ఖరారు చేసుకుంది. టీమిండియా తన తదుపరి మ్యాచ్‌ను మార్చి 2వ తేదీన కివీస్‌తో ఆడనుంది.

## నెదర్లాండ్స్‌కు మహిళల జట్టు ఝలక్



ఎఫ్ఐహెచ్ ప్రో లీగ్‌లో భారత పురుషుల, మహిళల జట్లు సత్తా చాటాయి. సోమవారం ఇంగ్లండ్ చేతిలో పురుషుల జట్టు, నెదర్లాండ్స్ చేతిలో మహిళల జట్లు ఓటమిపాలవ్వగా.. మంగళవారం జరిగిన రెండో లీగ్ మ్యాచ్‌లో మహిళలజట్టు షూట్-ఆఫ్‌లో ఒలింపిక్ ఛాంపియన్ నెదర్లాం డ్స్‌కు ఝలక్ ఇవ్వగా.. ఇంగ్లండ్ జట్టుపై పురుషుల జట్టు 2-1 గోల్స్‌తో విజయం నమోదు చేసుకుంది. కళింగ హాకీ స్టేడియంలో తొలుత జరిగిన మహిళల మ్యాచ్ నిర్ణీత సమయం ముగిసేసరికి ఇరుజట్లు 2-2గోల్స్‌తో సమంగా ఉండగా.. షూట్ ఆఫ్‌లో దీపిక, ముంతాజ్ ఖాన్‌లో గోల్స్ చేయగా.. నెదర్లాండ్స్ తరఫున మారిజ్ వీస్ మాత్రమే గోల్ చేయగల్గింది. సోమవారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో భారత మహిళల జట్టు 2-4గోల్స్ తేడాతో నెదర్లాండ్స్ చేతిలో ఓటమిపాలైన సంగతి తెలిసిందే. ఇక పురుషుల జట్టు రెండో క్వార్టర్ ముగిసేసరికి ఇరుజట్లు 1-1గోల్స్‌తో సమంగా నిలిచాయి. మూడో క్వార్టర్‌లో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ పెనాల్టీని గోల్‌గా మలచడంతో భారత్ 2-1గోల్స్ ఆధిక్యతలోకి దూసుకెళ్లింది. ఆ తర్వాత ఇరుజట్లు గోల్స్ చేయడంలో విఫలమయ్యాయి. భారత్ తరఫున తొలి గోల్‌ను హర్మన్‌ప్రీత్, ఇంగ్లండ్ తరఫున తొలి గోల్‌ను విలియమ్సన్ కానర్ చేశారు.

## టీం ఇండియా డ్రెస్సింగ్ రూంలోకి మరోసారి ధవన్ ఎంట్రీ



దుబాయ్: టీం ఇండియా మాజీ ఆటగాడు శిఖర్ ధవన్ బ్యాటింగ్‌కి ఎంతోమంది ఫ్యాన్స్ ఉన్నారు. ఫ్యాన్స్ అతన్ని ముద్దుగా 'గబ్బర్' అని పిలుస్తుంటారు. అయితే గత ఏడాది ఆగస్ట్‌లో అతను క్రికెట్ నుంచి రిటైర్ అవుతున్నట్లు ప్రకటించాడు. అయితే రిటైర్‌మెంట్ ప్రకటించిన తర్వాత ధవన్ మరోసారి టీం ఇండియా డ్రెస్సింగ్ రూంలోకి ఎంట్రీ ఇచ్చాడు.ఐసిసి ఛాంపియన్స్ ట్రోఫీలో భారత్ వరుస విజయాలతో దూసుకుపోతున్న విషయం తెలిసిందే. బంగ్లాదేశ్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో ఘన విజయం సాధించిన ఇండియా.. ఆదివారం దాయాది పాకిస్థాన్‌ను చిత్తుగా ఓడించింది. అయితే 2023 ఐసిసి ప్రపంచకప్ నుంచి బిసిసిఐ మ్యాచ్‌లో బెస్ట్ ఫీల్డర్‌కి మెడల్ ఇస్తున్న విషయం తెలిసిందే. పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్ అనంతరం కూడా ఈ మెడల్‌ను ప్రదానం చేయడానికి ధవన్‌ను జట్టు ఆహ్వానించింది. ఈ మెడల్ రేసులో అక్సర్ పటేల్, రవీంద్ర జడేజా, కెఎల్ రాహుల్ ఉండగా.. మెడల్ అక్సర్‌కు దక్కింది. పాక్‌తో జరిగిన మ్యాచ్‌లో అక్సర్ ఒక క్యాచ్ అందుకొని రెండు రనౌట్లు చేశాడు. ముఖ్యంగా ఇమామ్ ఉల్ హక్‌ని డైరెక్ట్ హిట్ ద్వారా అక్సర్ చేసిన రనౌట్ మ్యాచ్‌కే హైలైట్‌గా నిలిచింది. డ్రెస్సింగ్ రూంలోకి ధవన్ రాగానే జట్టు సభ్యులందరూ ఆయన్ని చప్పట్లతో ఆహ్వానించారు. అనంతరం ఆటగాళ్లతో ధవన్ ముచ్చటించారు. మ్యాచ్‌లో అద్భుతంగా బ్యాటింగ్ చేసిన కోహ్లీ, శ్రేయస్, గిల్‌లను ధవన్ అభినందించాడు. అనంతరం మెడల్‌ను ఆయన అక్సర్‌కు అందించాడు. ఇందుకు సంబంధించిన వీడియోని బిసిసిఐ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది.

## మహ్మద్ షమీపై కేఎల్ రాహుల్ కీలక వ్యాఖ్యలు..

ఛాంపియన్స్ ట్రోఫీలో భారత వికెట్ కీపర్ బ్యాట్స్‌మెన్ కెఎల్ రాహుల్ టీమ్ ఇండియాలో ముఖ్యమైన భాగం. ఇదిలా ఉంటే ఆయన ఓ ఇంటర్వ్యూలో ఓ పెద్ద విషయాన్ని వెల్లడించారు. టీమ్ ఇండియాలో ఒక బౌలర్ ఉన్నాడని, అతనిని ఎదుర్కోవడం తనకు అస్సలు ఇష్టం లేదని రాహుల్ చెప్పాడు. మహ్మద్ షమీ పేరు చెప్పిన రాహుల్ నెట్స్‌లో అతని ముందు బ్యాటింగ్ చేయకూడదని చెప్పాడు. జుర్రాచీ కి ఇచ్చిన ఈ ఇంటర్వ్యూలో రాహుల్.. రషీద్ ఖాన్ గురించి పెద్ద విషయం చెప్పాడు. ఇంటర్వ్యూలో కెఎల్ రాహుల్‌ను నెట్స్‌లో మీరు ఏ బౌలర్‌తో తలపడకూడదని ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో రాహుల్ నేరుగా మహ్మద్ షమీ పేరును ప్రస్తావించారు. షమీ విషయంలో రోహిత్ శర్మ కూడా ఇలాంటి మాటలే చెప్పాడు. నెట్స్‌లో షమీని అత్యంత ప్రాణాంతక బౌలర్‌గా రోహిత్ కూడా పరిగణించాడు. రాహుల్ చెప్పిన దాని ప్రకారం.. షమీ నెట్స్‌లో మరింత స్పీడ్‌గా బౌలింగ్ చేస్తాడని, పిచ్‌పై పచ్చటి గడ్డిని చూసినప్పుడు అతను బౌన్సర్‌లను బౌల్ చేస్తాడని రాహుల్ చెప్పుకొచ్చాడు. నిద్రలేని రాత్రులు ఇచ్చే బౌలర్‌గా రషీద్ ఖాన్‌ను కేఎల్ రాహుల్ అభివర్ణించాడు. మీకు నిద్రలేని రాత్రులు ఇచ్చిన బౌలర్ పేరు చెప్పండి అని యాంకర్.. రాహుల్‌ను అడిగారు. ఈ ప్రశ్నకు సమాధానంగా అతను రషీద్ ఖాన్ పేరు చెప్పాడు. ఖూా లో రషీద్ ఖాన్, ఖూ రాహుల్ ఒకరినొకరు ఎక్కువగా



ఎదుర్కొన్నారు. టీ20 క్రికెట్‌లో రషీద్ ప్రదర్శన చాలా అద్భుతంగా ఉన్న విషయం తెలిసిందే. ఛాంపియన్స్ ట్రోఫీ 2025లో టీమిండియా తరఫున కేఎల్ రాహుల్ తక్కువ బ్యాటింగ్ చేస్తున్నాడు. దీనికి సంబంధించి టీమ్ మేనేజ్‌మెంట్‌పై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. రాహుల్ లాంటి అనుభవజ్ఞుడైన ఆటగాడు ఇంత తక్కువ బ్యాటింగ్ చేయడం చూసి అభిమానులు కూడా సంతోషించలేకపోతున్నారు. అయితే ఇప్పటి వరకు టోర్నీలో టీమిండియా అద్భుత ప్రదర్శన చేయడంతో సెమీ ఫైనల్స్‌లో స్థానం ఖాయం అయింది.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE Jai Bheem

# లైలా అసలు టెన్షన్ ముందుంది

డిజాస్టర్లు ఏ హీరోకైనా సహజం. ఏదో అనుకుంటే ఇంకేదో జరగడం ప్రతి ఒక్కరికి అనుభవమే. కాకపోతే ఫలానా సినిమా చేయకపోతే బాగుండని ప్రేక్షకులతో అనిపించుకోవడం కొంతైనా బాధ కలిగిస్తుంది. పైగా ఈ సోషల్ మీడియా కాలంలో అది కేవలం విమర్శల దగ్గరే ఆగిపోదు. ట్రోలింగ్ అనే భూతం రూపంలో విరుచుకుపడుతుంది. అప్పటికే ఉన్న నెగటివ్ నెస్ మరికాస్త పెంచుతుంది. దీనికి చిన్నా పెద్ద తేడా ఉండదు. భోళా శంకర్, లాల్ సలామ్, రూలర్, బ్రహ్మోత్సవం, ఏజెంట్ లాంటి చాలా చిత్రాలు వీటిని రుచి చూసి ఆయా స్టార్లు మర్చిపోలేని గాయాలుగా మిగిలిపోయాయి. ఇప్పుడు విశ్వక్ వంతు వచ్చింది. లైలా థియేటర్లో సూపర్ ఫ్లాపయ్యింది. హీరో ఓపెన్ గా సారీ లెటర్ పెట్టేశాడు. ఓటమిని ఒప్పుకున్నాడు. ఇకపై అసభ్యత లేని సినిమాలే చేస్తానని హామీ ఇచ్చాడు. ఇక్కడిదాకా బాగానే ఉంది కానీ లైలా వచ్చే వారం మార్చి 7 నుంచి అమెజాన్ ప్రైమ్ లో స్ట్రీమింగ్ కావొచ్చని సమాచారం. ఇంకా అధికారికంగా చెప్పలేదు కానీ దాదాపు ఖరారేనట. టాక్ విని థియేటర్ కు వెళ్లని వాళ్ళు ఇది విశ్వక్ మూవీ కదానే ఉద్దేశంతో ఒక లుక్ వేద్దామని ఖచ్చితంగా ప్రయత్నిస్తారు. అప్పుడు అసలైన డ్యామేజ్ ఉంటుంది. కొందరు ఒక అడుగు ముందుకేసి వీడియోలు కట్ చేసి మరీ ట్రోలింగ్ తో విరుచుకుపడతారు. ఇదంతా ఇబ్బంది కలిగించక తప్పదు. కానీ కొంత కాలం భరించడం తప్ప వేరే ఆప్షన్ ఏముంది. తొందరపడి కథలు ఒప్పేసుకుంటే



దాని పరిణామాలు ఎలా ఉంటాయో లైలా మరో ఉదాహరణగా నిలిచింది.

## వంగ ఇంటర్వ్యూ ఇస్తే.. బాలీవుడ్ షేకే



సందీప్ రెడ్డి వంగ.. ఈ పేరు చెబితే చాలు కొంతమంది బాలీవుడ్ జనాలు షేకైపోతారు. అతను తీసే సినిమాలు మాత్రమే కాదు.. తన ఇంటర్వ్యూలు సైతం బాలీవుడ్ వాళ్లకు నిద్ర పట్టనివ్వవు. తెలుగులో 'అర్జున్ రెడ్డి'లో ప్రకంపనలు సృష్టించాక.. ఆ చిత్రాన్ని 'కబీర్ సింగ్'గా హిందీలో రీమేక్ చేస్తే అక్కడా బ్లాక్ బస్టర్ అయింది. కానీ ఇందులో పురుషాధిక్యతను గ్లోరిఫై చేశాడని.. సమాజాన్ని తప్పుదోవ పట్టించేశాడని ఇటు బాలీవుడ్ జనాలు, అటు క్రిటిక్స్ లబోదిబోమన్నారు. బాలీవుడ్లో దీన్ని మించిన చెడు పోకడలు ఎన్నో సినిమాల్లో చూసినప్పటికీ.. 'కబీర్ సింగ్'ను మాత్రమే టార్గెట్ చేయడం విడ్డూరం. ఇక తన తర్వాతి చిత్రం 'యానిమల్'ను బాలీవుడ్ ఎలా టార్గెట్ చేసిందో తెలిసిందే. లెజెండరీ లిరిసిస్ట్, రైటర్ జావెద్ అక్తర్ సహా చాలామంది ఆ సినిమాను తీవ్రంగా విమర్శించారు. ఇక క్రిటిక్స్ సంగతైతే చెప్పాల్సిన పనే లేదు. కానీ వాళ్లందరికీ కేవలం తన సినిమా వసూళ్లతోనే కాదు.. తన ఇంటర్వ్యూలతోనూ ఘాటుగానే సమాధానం చెప్పాడు సందీప్. తన సినిమాలను తప్పుబట్టే వాళ్లకు ఇంటర్వ్యూల్లో సందీప్ వేసే ప్రశ్నలు.. చాలా గట్టిగానే తగులుతుంటాయి. వాటికి అవతలి వైపు నుంచి సమాధానమే ఉండదు. బాలీవుడ్ జనాల హిపోక్రసీని అతను భలేగా బయటపెడుతుంటాడు. తాజాగా సందీప్.. కోమల్ నహతా అనే క్రిటిక్ కమ్ ట్రేడ్ అనలిస్ట్‌కు ఒక ఇంటర్వ్యూ ఇచ్చాడు. అది కేవలం ప్రోమోతోనే సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేసింది.

## పూజా హెగ్డేను అలా చూసి తట్టుకోగలరా?

పూజా హెగ్డే హీరోయిన్‌గా అరంగేట్రం చేసి దశాబ్దం దాటింది. కానీ ఇన్నేళ్లు గడిచినా ఆమెను ఒక గ్లామర్ హీరోయిన్‌గానే చూస్తున్నారు. ఆమె నటనకు ప్రాధాన్యం ఉన్న పాత్రలు చేసింది తక్కువ. 'అరవింద సమేత' లాంటి కొన్ని చిత్రాల్లో మాత్రమే కొంత నటనకు ప్రాధాన్యం లభించింది. అలాంటి పాత్రల్లోనూ ఆమె గ్లామరే హైలైట్ అయింది తప్ప.. నటన గురించి పెద్దగా మాట్లాడుకోలేదు. అందం కోణంలో తప్ప నటన కోసం చూడని కొద్దిమంది హీరోయిన్లలో పూజా ఒకరని చెప్పాలి. అలాంటి హీరోయిన్లను డీగ్లామరస్, పెయిన్ ఫుల్ క్యారెక్టర్లలో చూడడానికి ప్రేక్షకులు ఇష్టపడరు కూడా. గతంలో కాజల్ అగర్వాల్ కూడా ఈ కోవకే చెందేది. ఐతే పూజా కెరీర్లో తొలిసారిగా డీగ్లామరస్ రోల్ చేయబోతోందని.. ఆమెను ఒక షాకింగ్ క్యారెక్టర్లో రాఘవ లారెన్స్ చూపించబోతున్నాడని వార్తలు వస్తున్నాయి. కాంచన సిరీస్‌లో నాలుగో సినిమా తీయడానికి రాఘవ లారెన్స్ రెడీ అవుతున్న సంగతి తెలిసిందే. ఇందులో పూజా హెగ్డేను కథానాయికగా ఎంచుకున్నాడు. ఆమె ఈ సినిమాలో చెవిటి-మూగ అమ్మాయిగా కనిపించబోతోందనే వార్త ఆశ్చర్యానికి గురిచేస్తోంది. పూజా లాంటి గ్లామర్ హీరోయిన్ ఇలాంటి పాత్ర చేయడం ఏంటి అని తన ఫ్యాన్స్ అవాక్కవుతున్నారు. ఇంతకుముందు 'గంగ' (కాంచన-3)లో సినిమాలో నిత్యా మీనన్‌ను దివ్యాంగురాలిగా చూపిస్తే బాగానే కుదిరింది.



## టాలీవుడ్‌కు కొత్త అందం భైరవి



టాలీవుడ్ స్క్రీన్‌కు ఓ కొత్త గ్లామర్ యాడ్ కాబోతోంది. అందం, అభినయం కలగలిసిన భైరవి తెలుగు ప్రేక్షకులకు పరిచయం అవుతోంది. 'సర్కార్ నౌకరి' ఫేమ్, ప్రముఖ సింగర్ సునీత తనయుడు ఆకాష్ హీరోగా తథాస్తు క్రియేషన్స్ బ్యానర్‌పై చేస్తున్న ప్రొడక్షన్ నెంబర్ 1 మూవీలో హీరోయిన్‌గా భైరవి నటించింది. ఇది ఆమెకు డెబ్యూ మూవీ అయినప్పటికీ తన ప్రతిభతో ఎంతో పరిణితితో నటించింది. సెంటిమెంట్, ఎమోషనల్ వంటి సీన్లలో భైరవి యాక్టింగ్ నెక్స్ లెవెల్‌లో ఉండబోతున్నట్టు చిత్ర యూనిట్ చెబుతోంది. సినిమా విడుదల తర్వాత భైరవి తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో నిలిచిపోవడం ఖాయమని అంటున్నారు. శివ వరప్రసాద్ దర్శకత్వంలో తాటి బాలకృష్ణ నిర్మాణంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో సీనియర్ నటులు రఘుబాబు, పృథ్వీ, ప్రభావతి తదితరులు నటించారు. ఈ సందర్భంగా నిర్మాత తాటి బాలకృష్ణ మాట్లాడుతూ "ఈ మూవీని విలేజ్ బ్యాక్ గ్రౌండ్‌లో రూపొందిస్తున్నాం. రొమాంటిక్ లవ్, సస్పెన్స్ కామెడీ చిత్రమిది. ప్రస్తుతం మూవీ పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలను జరుపుకుంటోంది. త్వరలోనే సినిమా టైటిల్, విడుదల తేదీని ప్రకటిస్తాం"అని అన్నారు.

## మిమో చక్రవర్తి యాక్షన్ సీన్స్ ఇరగదీశారు

ప్రముఖ బాలీవుడ్ నటుడు, సీనియర్ హీరో మిథున్ చక్రవర్తి కుమారుడు మిమో చక్రవర్తి, ఎయిర్ టెల్ ఫేం సాషా చెత్రి ప్రధాన పాత్రల్లో నటించిన సినిమా 'నేనెక్కడున్నా'. కేబీఆర్ సమర్పణలో మారుతి శ్యాం ప్రసాద్ రెడ్డి నిర్మించారు. ఈ సినిమాతో మాధవ్ కోదాడ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఈ చిత్రం ఈనెల 28న విడుదల కానుంది. ఈ చిత్ర ప్రీ రిలీజ్ వేడుక హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రిటైర్డ్ ఐపీఎస్, ఐఏఎస్ అధికారులు గంగాధర్, గోపీనాథ్ రెడ్డితో పాటు టాలీవుడ్ నుంచి పలువురు ప్రముఖులు అతిథులుగా హాజరయ్యారు. వీవీ వినాయక్, బ్రహ్మాజీ, ప్రేమ్ రక్షిత్ వీడియో బైట్స్ ద్వారా శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకలో హీరో మిమో చక్రవర్తి మాట్లాడుతూ "సినిమా ట్రైలర్ అందరికీ నచ్చే ఉంటుంది. ఈ సినిమాకు మెయిన్ హీరో మాధవ్. మా నాన్నగారిలా నేను కూడా తెలుగు సినిమా ఇండస్ట్రీలో భాగమవుతున్నందుకు చాలా హ్యాపీగా ఉంది. ఈనెల 28న వస్తున్న ఈ సినిమాను అందరూ థియేటర్లలో చూడాలని కోరుకుంటున్నాను"అని అన్నారు. చిత్ర దర్శకుడు మాధవ్ కోదాడ మాట్లాడుతూ "మిమోకు త్వైకాండోలో బ్లాక్ బెల్ట్ ఉంది. యాక్షన్ సీన్స్ ఇరగదీశారు. సాషా కూడా బాగా చేశారు. తనికెళ్ళ భరణి చిన్న చిన్న ఎక్స్‌ప్రెషన్స్‌తో కంటతడి పెట్టించారు. మ్యూజిక్ డైరెక్టర్ రాజేష్ తన నేపథ్య సంగీతంతో సినిమాను నెక్స్ లెవల్ కు తీసుకు వెళ్లారు" అని చెప్పారు. ఈ కార్యక్రమంలో రైటర్,-డైరెక్టర్ బీవీఎస్ రవి, హీరోయిన్ సాషా చెత్రి. చందు, మిహీరా, లావణ్య తదితరులు పాల్గొన్నారు.



## 'సామజవరగమన' ఎందుకు వదులుకున్నాడు?



హీరోల దగ్గరికి వెళ్లే ప్రతి కథా ఓకే అయిపోదు. కొన్ని తమకు నచ్చక, కొన్ని సూట్ కావేమో అన్న ఉద్దేశంతో వాటిని తిరస్కరిస్తుంటారు. ఆ కథలే వేరే హీరోల దగ్గరి వెళ్లి పట్టాలెక్కేస్తుంటాయి. అవి హిట్టయినపుడు వాటిని రిజెక్ట్ చేసిన హీరోలు ఫీలవడం కామన్. కానీ కొందరు మాత్రం తాము సరైన నిర్ణయమే తీసుకున్నామని అనుకుంటారు. 'సామజవరగమన' సినిమా విషయంలో సందీప్ కిషన్ కూడా తాను సరైన నిర్ణయమే తీసుకున్నానని అంటున్నాడు. శ్రీ విష్ణు హీరోగా నటించిన ఈ చిత్రం సూపర్ హిట్టయిన సంగతి తెలిసిందే. ఈ చిత్ర నిర్మాతల్లో ఒకడైన అనిల్ సుంకర.. సందీప్‌కు బాగా క్లోజ్. సందీప్‌కు 'సామజవరగమన' కథ బాగా నచ్చిందట కూడా. కానీ ఆ సినిమాను అతను చేయలేకపోయాడు. దీని గురించి తన కొత్త చిత్రం 'మజాకా' ప్రమోషన్లలో భాగంగా ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో మాట్లాడాడు సందీప్. "సామజవరగమన కథ ముందు నాకే చెప్పారు. నాకు ఆ కథ చాలా బాగా నచ్చింది. నేనే చేద్దామని కూడా అనుకున్నా. కానీ అదే సమయంలో 'మైకేల్' మూవీ చేస్తున్నా. అదొక డిఫెంట్ మూవీ. దానికి ఒక మూడ్‌లో ఉండాలి. ఒకలా నటించాలి. ఆ సినిమా చేస్తూ 'సామజవరగమన' లాంటి కామెడీ మూవీ చేయడం కరెక్ట్ కాదు అనిపించింది. అదొక క్రియేటివ్ కాల్. ఆ సమయానికి నేను సరైన నిర్ణయమే తీసుకున్నానని అనుకుంటా. తప్పో ఒప్పో 'మైకేల్' సినిమా డిస్టర్బ్ అవుతుందని.. 'సామజవరగమన' చిత్రంలో నటించొద్దని నిర్ణయించుకున్నా. కానీ ఆ సినిమా నాకు చాలా ఇష్టం. దాన్ని వదులుకున్నందుకు బాధ ఏమీ లేదు" అని సందీప్ తెలిపాడు. ఇదిలా ఉండగా.. 'మజాకా' సినిమాను ముందు మేకర్స్ చిరంజీవి-సిద్ధు జొన్నలగడ్డ కాంబినేషన్లో చేయాలనుకున్నారు.